Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 133 మేడ్చల్ మల్కాజ్‌గిరి 4 జూన్ 2023 ఆదివారం పేజీలు : 4

## తగ్గనున్న వంట నూనెల ధరలు!

దిల్లీ: వంట నూనెల ధరలను లీటరుకు రూ. 8-12 మేర వెంటనే తగ్గించాలని వంట నూనెల తయారీ సంస్థల అసోసియేషన్లకు కేంద్రం సూచించింది. అంతర్జాతీయ విపణిలో ధరలు నెమ్మదించిన నేపథ్యంలో అందుకనుగుణంగా దేశీయ వంట నూనెల ధరలను తగ్గించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. 'కొన్ని కంపెనీలు తమ వంట నూనెల ధరలను తగ్గించలేదు. మిగతా బ్రాండ్ల గరిష్ఠ చిల్లర ధర(ఎంఆర్‌పీ)లతో పోలిస్తే వాటి ధరలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే ఆయా సంస్థలు వెంటనే ధరలు తగ్గించాలని సలహా ఇచ్చామ'ని ఆహార కార్యదర్శి సంజీవ్ చోప్రా అధ్యక్షతన జరిగిన పరిశ్రమ ప్రతినిధుల సమావేశం తర్వాత ఆహార మంత్రిత్వ శాఖ వెల్లడించింది. తయారీ, రిఫైనరీ సంస్థలు పంపిణీదార్లకు సరఫరా చేస్తున్న ధరలను కూడా వెంటనే తగ్గిస్తే ధరల తగ్గింపు వెంటనే వినియోగదార్లకు బదిలీ అవుతుందని పేర్కొంది.



# గెలుపు వ్యూహం ఇదే!!

## ఈ సారి కేసీఆర్కు మోడీనే అస్త్రం..

హైదరాబాద్ : తెలంగాణ ఎన్నికలకు మరో ఆరు మాసాల సమయం మాత్రమే ఉంది. నవంబరు-డిసెంబరు మధ్యలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా.. సెంటిమెంటును ప్రధానా స్త్రంగా ప్రచారాస్త్రంగా మలుచుకుని.. ముందుకు సాగడంలోనూ.. ప్రజలను తనవైపు తిప్పుకోవడంలోనూ కేసీఆర్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తారనేది అందరికీ తెలిసిందే. 2014 ఎన్నికల్లో తెలంగాణ తెచ్చిన యోధుడిగా.. తనను తాను చిత్రీకరించుకోవడంలో కేసీఆర్ సఫలీకృత మయ్యారు. 2018 ముందస్తు ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబును అడ్డు పెట్టుకుని సెంటిమెంటును పేల్చి.. గెలుపు గుర్రం ఎక్కారు. రెండు సార్లు పాలనతో జాతీయ స్థాయిలో ఇప్పుడు చక్రం తిప్పాలని నిర్ణయించుకున్నారు. ఇదిలావుంటే.. ఎంతైనా.. రెండు సార్లు వరుసగా అధికారం ఇచ్చిన ప్రజలు.. ఇప్పుడేమనుకుంటున్నారు? అనేది ప్రశ్న.

దీనిని గమనిస్తే.. ప్రతిపక్షాల జోరు పెరిగింది. వారు చేస్తున్న పాదయాత్రల హవా కూడా ఓ రేంజ్లో ఉంది. మరోవైపు.. నియామకాలు చేపడుతున్నా.. కుటుంబ పాలన సాగిస్తున్నారనే మధ్యతరగతి వాదన ఎలానూ వినిపిస్తోంది. మొత్తంగా చూస్తే.. ఈ దఫా ఎలాంటి సెంటిమెంటూ లేకపోతే.. కేసీఆర్ గెలుపు కొంత ప్రశ్నార్థకమే అవుతుందనే అంచనాలు వస్తున్నాయి. అయితే.. అందని వరంగా ఇప్పుడు మోడీనే కేసీఆర్కు సెంటిమెంటు అస్త్రంగా మారుతున్నారనే చర్చ జోరుగా సాగుతోంది. రాష్ట్రానికి రుణ సదుపాయం కల్పించకపోవడం రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్టు కూడా అమలు చేయకపోవడం.. విభజన చట్టంలోని అంశాలను ఇప్పటికీ పట్టాలెక్కించకపోవడం వంటివాటిని.. కేసీఆర్ ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. ఇదేసమయంలో ఇప్పుడు లిక్కర్ స్కాం.. తన కుమార్తెకు సమన్లు వంటి అంశాలను కూడా కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా వాడుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. అదేవిధంగా ఎమ్మెల్యేల కొనుగోలు కేసును కూడా తమకు అనుకూలంగా మార్చుకుని.. ఈ దఫా.. "ఢిల్లీ దండయాత్రను ఒప్పుకొందామా? వారి అరాచకాలను భరిద్దామా?" అనే నినాదాన్ని.. కేసీఆర్ వినిపించి.. ప్రజలను మరోసారి తన వైపు తిప్పుకొనే ప్రయత్నం చేస్తారని.. అంటున్నారు పరిశీలకులు.

# ప్రతి నలుగురు గులాబీ ఎమ్మెల్యేల్లో ఒకరికి షాక్ తప్పదట

హైదరాబాద్ : మరో నాలుగైదు నెలల్లో తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్న వేళ.. అధికార పార్టీలో టికెట్ల పంచాయితీ అంతకంతకూ రాజుకుంటోంది. ఇప్పటివర కు సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికి టికెట్లు ఖాయమన్న గులాబీ బాస్ కేసీఆర్.. సర్వే రిపోర్టుల్లో మంచిగా ఉంటేనే అన్న క్లాజ్ పెట్టటం తెలిసిందే. ఈ క్లాజ్ దెబ్బకు మొత్తం గులాబీ ఎమ్మెల్యేల్లో పాతిక శాతం మందికి టికెట్లు లభించే పరిస్థితి లేదన్న మాట వినిపిస్తోంది. ప్రజా వ్యతిరేకతను తప్పించుకోవటానికి.. హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకోవటానికి సరికొత్త లెక్కల్ని సారు సిద్ధం చేసుకుంటున్నట్లుగా చెబుతున్నారు. విశ్వసనీయ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం ప్రతి నలుగురు ఎమ్మెల్యేల్లో ఒకరికి టికెట్ దక్కే వీల్లేదన్న మాట వినిపిస్తోంది. 2018లో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు 88 మంది గెలుపొందగా.. మరో 15 మంది ఎమ్మెల్యేలు ఇతర పార్టీల నుంచి వలస రావటం తెలిసిందే.

దీంతో.. టీఆర్ఎస్ అలియాస్ బీఆర్ఎస్ బలం 103 మందిగా మారింది. వచ్చే ఎన్నికల్లో వీరిలో నాలుగో వంత ఎమ్మెల్యేలకు టికెట్ల ను ఇచ్చే అవకాశం లేదంటున్నారు. గులాబీ ఎమ్మెల్యేల్లో కొందరు ఎమ్మెల్యేల మీద ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి ఉంది. దీనికి తోడు.. స్థానికంగా ఉన్న లెక్కలు.. అసమ్మతిని పరిగణ లోకి తీసుకుంటున్న అధినాయకత్వం.. ఈసారి నాలుగోవంతు కొత్త




ముఖాలతో ఎన్నికల బరిలోకి దిగాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. దీనికి సంబంధించిన నిర్ణయాన్ని సీఎం కేసీఆర్ ఇప్పటికే తీసుకున్నారని.. కానీ.. ఆ విషయాన్ని సమయం.. సందర్భం చూసుకొని బయటపెడతారని చెబుతున్నారు. సిట్టింగుల్లో సర్వే రిపోర్టుల్లో బలహీనంగా ఉన్న వారికి సంబంధించిన వివరాల్ని ఒకటికి నాలుగు సార్లు తెప్పించుకున్న కేసీఆర్.. అలాంటి వారి తీరు మార్చుకోవాలని సందేశాల్ని పంపినా.. వారిలో మార్పు రాకపోవటాన్ని సీరియస్ గా తీసుకున్నట్లు చెబుతన్నారు. 2018లో జరిగిన ఎన్నికల్లో ఏడుగురు సిట్టింగ్ లకు టికెట్ల ఇవ్వని కేసీఆర్ ఈసారి ఏకంగా పాతిక మంది వరకు టికెట్ల విషయంలో మొండిచెయి చూపించే వీలుందంటున్నారు. దీంతో.. గులాబీ ఎమ్మెల్యేల్లో కొత్త టెన్షన్ పట్టుకుందన్న మాట వినిపిస్తోంది. కొన్ని జిల్లాల్లో ఒకరిద్దరికి అయితే మరికొన్ని జిల్లాల్లో ఇద్దరు.. ముగ్గురుకు కూడా టికెట్ల విషయంలో మొండి చెయి ఖాయమంటున్నారు. కరీంనగర్ జిల్లాలో ముగ్గురు.. నిజామాబాద్.. అదిలాబాద్.. రంగారెడ్డి..మహబూబ్ నగర్.. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో ఒక్కో ఎమ్మెల్యే.. మెదక్ లో ఒకరిద్దరు.. వరంగల్ జిల్లాలో ఇద్దరికి టికెట్లు ఇచ్చే అవకాశం లేదంటున్నారు. దీంతో.. ఆయా జిల్లాల్లో ని గులాబీ ఎమ్మెల్యేల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్న మాట వినిపిస్తోంది. పార్టీలో ని అంతర్గత విభేదాలు పార్టీ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాల్లో బయటపడగా.. వాటిని సర్దుబాటు చేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో లోగుట్లు చాలా వరకు అధినాయకత్వానికి రిపోర్టుల రూపంలోచేరినట్లుగా చెబుతున్నారు.





తెలంగాణ రైతు దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని సదాశివనగర్ మండలం పద్మాజివాడి రైతు వేదికను స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్సీ కవిత ప్రారంభించారు. కార్యక్రమానికి ఆమె ఎడ్లబండిపై వచ్చి భారాస శ్రేణుల్లో జోష్ నింపారు.

# పెట్టుబడులకు స్వర్గధామం తెలంగాణ

## అనూహ్యంగా 150% వృద్ధి




హైదరాబాద్ : తెలంగాణకు పెట్టుబడులు భారీగా పెరిగాయి. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సంస్థలు సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. పెట్టుబడుల్లోనేగాక.. ఉద్యోగావకాశాల్లోనూ తెలంగాణలో గణనీయమైన పురోగతి కనిపిస్తోంది. 2020-21తో పోల్చితే 150 శాతం వృద్ధి సాధించినట్లు ఎంఎస్ఎంఈ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ నివేదికలో వెల్లడించింది. పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెంపొందించటంతో పాటుగా కీలక రంగాల్లో సాధించిన పురోగతిని నివేదికలో స్పష్టం చేసారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు రూ. 2.6 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. వీటి ద్వారా రాష్టంలో 17.53 లక్షల ఉద్యోగాలు లభించాయి. పెట్టుబడులకు తెలంగాణ చిరునామాగా మారుతోంది. 'ఇన్వెస్ట్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్ తెలంగాణ' అంశంపై ఎంఎస్ఎంఈ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఓ అధ్యయనం చేసింది. ఇందులో గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో రాష్ట్రంలోకి వచ్చిన పెట్టుబడులు లక్ష కోట్ల రూపాయలపైగా ఉన్నట్లు నిర్ధారించారు. 2020-21తో చూస్తే 2021-22లో వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనల విలువ సుమారు 150 శాతం పెరగాయని నివేదిక తేల్చింది. 2014-15తో పోల్చితే 2021-22లో రాష్ట ఐటీ ఎగుమతులూ రెట్టింపు అయ్యాయని వివరించారు. 2020-21లో రూ. 31,274.56 కోట్ల విలువైన ప్రతిపాదనలు రాగా.. 2021-22 సంవత్సరంలో రూ. 76,568.89 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చినట్లు నివేదిక పేర్కొంది. ఇన్వెస్టర్లకు అనువైన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని నివేదిక పేర్కొంది. పరిశ్రమలకు కావాల్సిన ప్రోత్సాహం..మౌళిక వసతుల కల్పనకు ప్రభుత్వం ఇస్తున్న తోడ్పాటు సత్ఫలిలు ఇస్తోందని నివేదిక స్పష్టం చేస్తోంది. వైద్య రంగంలోనూ తెలంగాణ మెరుగైన ప్రగతిని కనబరుస్తున్నది. 2 లక్షల మంది వైద్య చికిత్స కోసం తెలంగాణకు వచ్చినట్టుగా నివేదిక వెల్లడించింది. వీరిలో ఎక్కువగా ఆఫ్రికా, గల్ఫ్ దేశాలు, కామన్‌వెల్త్ ఇండిపెండెంట్ దేశాల నుంచి వస్తున్నట్టుగా గుర్తించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్ చెయిన్, క్లౌడ్ అడాప్షన్, సైబర్ సెక్యూరిటీ వంటి భవిష్యత్తు ఉన్న అంశాల్లో తెలంగాణ ఎంతో ఆకర్షణీయ ప్రాంతంగా నిలిచిందని ఎంఎస్ఎంఈ ఈపీసీ చైర్మన్ డీఎస్ రావత్ పేర్కొన్నారు. -22లో ప్రైవేట్ రంగంలో పెట్టుబడులు భారీగా పెరిగినట్లు నివేదికలో పేర్కొన్నారు. 2022 ఆర్థిక సంవత్సరంలో రూ. 14,882.35 కోట్ల నుంచి రూ. 60,618.05 కోట్లకు చేరుకున్నట్లుగా నివేదిక వెల్లడించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తరువాత ఇప్పటి వరకు వచ్చిన పెట్టబడులు..ఉపాధి కల్పన గురించి నివేదిక కీలక అంశాలను వెల్లడించింది. దేశ జీడీపీ 1.4 శాతం క్షీణతను చూసిన సమయంలో తెలంగాణలో ప్రతికూల పరిస్థితులను అధిగమంచి రాష్ట్ర జీడీపీ 2.2 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇక ఐటీ రంగంలో తెలంగాణ రాష్ట్రం.. పెట్టుబడులకు అత్యంత అనువైన ప్రాంతంగా నివేదిక ప్రత్యేకంగా ప్రస్తావించింది. ప్రపంచంలోని టాప్-5 ఐటీ కంపెనీలు అమెరికా తరువాత తమ ప్రధాన కార్యాలయాలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఐటీ ఎగుమతులు 2014-15లో రూ. 66,276 కోట్ల నుంచి 2021-22లో రూ. 1,45,522 కోట్లకు రెట్టింపు అయ్యాయి. 2014-15లో ఉపాధి 3.71 లక్షల నుండి 2021-22 నాటికి ఐటీ రంగంలో 7 లక్షలకు పెరిగింది. రాష్ట్రంలో వ్యవసాయం, అనుబంధ రంగాలు కూడా 2020-21 ఆర్థిక సంవత్సరంలో 12.4 శాతం వృద్ధి చెందగా.. 2021-22లో 9.09 శాతం వృద్ధిని సాధించాయి. ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్, పాలసీ సపోర్టు వల్ల ఇది సాధ్యమైందని నివేదిక వివరించింది.

# సంపాదకీయం

## ముక్కలేనిదే ముద్దదిగడం లేదే?

తెలంగాణలో మద్యం మాత్రమే కాదు.. మాంసం విక్రయాలు కూడా భారీగా పెరుగుతున్నాయి. ముక్కలేనిదే ముద్ద దిగని వారు పెరిగిపోతున్నారు. దేశంలో ఎక్కడా లేనిది తెలంగాణలో నాన్ వేజ్ ఎక్కువగా తినేస్తున్నారు. తగ 4 ఏళ్ల లెక్కలు చూస్తే ఇదే తేటతెల్లం చేస్తోంది. గత 4 ఏళ్లలో తెలంగాణలో 9.75 లక్షల టన్నుల గొర్రె మేక మాంసం ఉత్పత్తి విక్రయాలు జరిగినట్లు మేకలుగొర్రెల అభివృద్ధి సమాఖ్య ఓ నివేదిక అందించింది. జాతీయ వార్షిక మాంసం వినియోగం 5.4 కిలోలు ఉండగా.. తెలంగాణలో మాత్రం ఏకంగా 21.17 కిలోలు ఉందని నివేదిక వెల్లడించింది. ఈ మాంసం మొత్తం విలువ ఏకంగా రూ.58500 కోట్లు అని పేర్కొంది. తెలంగాణలో మాంసాహార వినియోగం బాగా పెరిగిందని సర్వేలో తేలింది. ముక్కలేనిదే ముద్దదిగని వారు చాలా మందే ఉన్నారు. కొందరు ఆదివారాలు ఫుల్లుగా మాంసాన్ని తెచ్చుకొని లాగేస్తే.. ఇంకొందరు ఇతర వారాల్లో కూడా మాంసాహారాన్ని తీసుకుంటున్నారు. కరోనాకు చెక్ పెట్టాలంటే మాంసాహారం తినాలని వైద్యులు సూచించడంతో అప్పటి నుంచి వీటి వినియోగం బాగా పెరిగింది. ముఖ్యంగా చికెన్ మటన్ సెంటర్ల వద్ద ప్రజలు సందడి చేస్తూనే ఉన్నారు. రేటు ఎంతైనా సరే వారానికి ఒకసారైనా మాంసం రుచి చూడాలనుకునే వారు ఎక్కువ మందే ఉన్నారు. తాజాగా ఎన్ఎఫ్.హెచ్.ఎస్5 సర్వేలో భాగంగా మాంసాహారం తినేవారిపై సర్వే నిర్వహించారు. దీంతో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. దేశంలో మొత్తంగా 77 శాతం మంది మంది మాంసాహారాన్ని తింటున్నట్లు తేలింది. ఇందులో అత్యధికంగా చికెన్ మటన్ ఫిష్ మాంసాన్ని ఎక్కువగా తీసుకుంటున్నారు. ఇక తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే దేశ సగటు కంటే చాలా ఎక్కువగా తెలంగాణలో 96శాతం ఏపీలో 96 శాతం మంది మాంసాహారాన్ని తింటున్నట్లు తేలింది. అత్యధికంగా లక్షద్వీప్ లో 100శాతం మంది మాంసాన్ని తింటుండగా.. అతి తక్కువగా రాజస్థాన్ లో కేవలం 31శాతం మంది మాత్రమే మాంసాన్ని ఆహారంగా తీసుకుంటున్నారు. దేశంతో గత సర్వేతో పోలిస్తే ఈ సారి మాంసం ఆహారం తీసుకునే వారి సంఖ్య తెలంగాణలో బాగా పెరగడం విశేషం.

# అర్హులకు ఆహార భద్రత



ఆసిఫాబాద్ : నిరుపేదలకు నిత్యావసర సరకులు తక్కువ ధరకే అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేసింది. పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో ఆహార భద్రత పథకం ద్వారా రేషన్‌కార్డులు ఉన్న కుటుంబాలకు ప్రతి నెలా బియ్యం పంపిణీ చేస్తున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక వివిధ కారణాలతో అనర్హుల పేరుతో రేషన్‌కార్డులను రద్దుచేశారు. అయితే రద్దయిన కార్డుల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో రెండు రెవెన్యూ డివిజన్లలో 18 మండలాలు ఉన్నాయి. ఇందులో 423 రేషన్ దుకాణాల ద్వారా ప్రస్తుతం నెలకు 2 లక్షలకు పైగా కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి నోటీసులు లేకుండా రద్దయిన వాటిని తిరిగి పునర్ పరిశీలించనున్నారు. ఇందుకు మండలాల వారీగా కార్డులను గుర్తించి సర్వే చేయిస్తున్నారు. ఇప్పటికే సదరు ప్రక్రియ జిల్లాలో మొదలైంది. పౌరసరఫరాల శాఖ అధికారులు ఆయా మండలాల తహసీల్దార్ల లాగిన్‌లకు సమాచారాన్ని చేరవేశారు. అందుబాటులో ఉన్న లబ్ధిదారులను విచారిస్తున్నారు. లబ్ధిదారుడు మృతిచెందడం, వలస వెళ్లడం, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం, కుటుంబాలు వేరుపడటం, ఒక కార్డు నుంచి మరో కార్డులో సభ్యుల చేరిక, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని కార్డులను గతంలో తొలగించారు. అప్పట్లో వాటికి నోటీసులు జారీచేయలేదు. వీటిని నిర్ధారించి మళ్లీ నోటీసులు జారీ చేయనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు తొలగింపు, రద్దునకు గురైన జాబితాలో అత్యధికంగా మంచిర్యాల మండలంలో 5834 యూనిట్లు ఉండగా, వేమనపల్లిలో అత్యల్పంగా 67 తొలగించారు. ఒక వేళ అర్హులై ఉన్నా తొలగిపోతే తరువాత మంజూరు చేసిన కార్డుల్లో పేర్లు నమోదు, లేదా కొత్తగా కార్డులు పొందే అవకాశం ఉంటుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. క్షేత్రస్థాయిలో ఈ నెల 27 వరకు పరిశీలించి తుది నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నారు. సక్రమంగా పరిశీలించి, వాస్తవ పరిస్థితులతో నివేదిక సమర్పిస్తే అర్హులకు కార్డులు అందే అవకాశముంది. నెన్నెల మండలంలో 195 మంది లబ్ధిదారులను తొలగించారు. కార్డుల పునరుద్ధరణకు సర్వే చేపడుతుండగా ఇప్పటి వరకు 125 మందిని అనర్హులుగానే గుర్తించినట్టు ఓ అధికారి తెలిపారు

సర్వే జరుగుతోంది – ప్రేమ్‌కుమార్, డీసీఎస్‌వో

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ముందుకు సాగుతున్నాం. తొలగింపు కార్డులపై సర్వే జరుగుతోంది. అనర్హులకు నోటీసులు అందించి అర్హుల జాబితాను ప్రభుత్వానికి నివేదిస్తాం. గడువులోగా ఈ ప్రక్రియ పూర్తికి చర్యలు తీసుకుంటాం

# అంగన్‌వాడీ.. సౌకర్యాలు కొరవడి



ఆసిఫాబాద్ :పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అంగనాడీ కేంద్రాలు జిల్లాలో పలు చోట్ల అరకొర వసతుల మధ్య కొనసాగుతున్నాయి. ఉన్న భవనాలు కొన్ని శిథిలం కాగా, మరి కొన్ని అద్దె భవనాలు, ఇరుకు గదుల్లో సాగుతున్నాయి. వర్షాకాలంలో చిన్నారులు, గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల భవనాల పై పెచ్చులు ఊడిపోవడంతో భయాందోళన చెందుతున్నారు. ఆట స్థలాలు లేక ఆటలకు దూరమవుతున్నారు. ఒకేచోట వంట, తరగతులు, సౌకర్యాల్లేని అద్దె గదులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చిన్నారులకు కష్టాలు

జిల్లాలోని కేవలం 289 అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. కొన్ని అద్దె భవనాల్లో, మరి కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సాగుతున్నాయి. ఇరుకు గదులు, సరైన సదుపాయాలు లేక చిన్నారులు, బాలింతలు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అద్దె భవనాలకు సకాలంలో అద్దె సొమ్ము విడుదల కాకపోవడంతో అగన్‌వాడీ టీచర్లు వేతనాల నుంచి అద్దె చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది.

మరమ్మతుల కోసం ప్రతిపాదనలు : సావిత్రి, జిల్లా సంక్షేమ అధికారి

శిథిలమైన భవనాల మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించాం. కొన్ని చోట్ల మరమ్మతులు చేయించాం. మరమ్మతులు చేయించేలా చర్యలు తప్పకుండా తీసుకుంటాం. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటి అద్దె నెలవారీగా వచ్చేలా చర్యలు తీసుకుంటాం.ఇది బెజ్జూరు మండలంలోని పాపన్‌పేట్ అంగన్‌వాడీ కేంద్రం-1. భవనం పెంకులు పోయి వర్షం నీరు గదుల్లో పడుతున్నాయి. భవనం సైతం శిథిలమైంది. దీంతో చిన్నారులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇందులో చిన్నారులు సుమారు 100 మంది ఉన్నారు. గర్భిణులు 13 మంది, బాలింతలు 10 మంది వరకు ఉన్నారు. ఇక్కడ సదుపాయాలు లేకపోవడంతో ఇక్కట్లు తప్పడం లేదు. భవనానికి మరమ్మతులు చేయాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.బెజ్జూరు మండలంలో అద్దె భవనంలో ఇప్పలగూడ అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతుంది. ఇందులో 48 మంది పిల్లలు, 8 బాలింతలు, 9 మంది మంది గర్భిణులు ఉన్నారు. అద్దె భవనంలో ఇరుకుగదిలో ఇక్కట్ల మధ్య సాగుతోంది.

పెంచికల్‌పేట్ మండలం బొంబాయిగూడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఆ కేంద్రం అంగన్‌వాడీ సిబ్బంది ఇంటి వద్ద చదువులు కొనసాగుతున్నాయి. ఇక్కడ నూతన భవనం నిర్మించాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో అంగనాడీ కేంద్రాల వివరాలు మొత్తం అంగన్‌వాడీలు: 973 మేజర్ అంగన్‌వాడీలు : 834 మిని అంగన్‌వాడీలు : 139 స్వంత భవనాలు ఉన్నవి : 289 అద్దె భవనాల్లో కొనసాగుతున్నవి: 318 పాఠశాలల్లో కొనసాగుతున్నవి : 366 గర్భిణులు : 5282 బాలింతలు : 4984 0-6సంవత్సరాల లోపు పిల్లలు: 53,983

# కబ్జా చేసి... దర్జాగా నిర్మించేసి

ఆసిఫాబాద్ : ఎలాంటి అనుమతులు లేకుండానే ప్రభుత్వ భూమిలో భారీ భవనాన్ని ఎన్‌జీఓ కాలనీలో నిర్మిస్తున్న తీరిది. రహదారి వరకు ఉన్న స్థలాలను సైతం ఆక్రమించుకున్నారు. కనీసం మురికికాలువ కట్టే ప్రదేశం సైతం ఇక్కడ లేదు.జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూములను కబ్జా చేయడంతోపాటు ఎలాంటి అనుమతులు లేకుండా భారీగా అక్రమ కట్టడాలను నిర్మిస్తున్నారు. ఖాళీ స్థలాలను పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులు పట్టనట్లుగా ఉండడంతో అక్రమార్కులు మూడు, నాలుగు అంతస్తుల భవనాలను సైతం శరవేగంగా నిర్మించేస్తున్నారు. క్రయ విక్రయాలు అవకాశం లేని భూములు వెంచర్లుగా రూపొందుతున్నాయి. అసైన్డ్, బీడీపీపీ భూములు ప్లాట్లుగా రూపాంతరం చెందుతున్నాయి. ఈ దందాను నిలువరించే అధికారులు 'మామూలుగా' వ్యవహరిస్తుండటంవల్లే జిల్లాలో భూబకాసురుల ఆగడాలకు అంతులేకుండా పోతుందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

క్రయవిక్రయాలకు వీలు లేకున్నా..జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్ సముదాయ భవనం ఎదురుగా ఎన్‌జీఓ కాలనీ ఉంది. ఇక్కడంతా ఉద్యోగులే ఉన్నారు. 1984 సంవత్సరంలో 120 మంది ఉద్యోగులకు ఒక్కో ప్లాటు ఇచ్చారు. ఇందులో చాలా మంది ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడం, ఇళ్లను నిర్మించుకోకపోవడంతో పదుల సంఖ్యలో ఖాళీ స్థలాలు కబ్జాలకు గురయ్యాయి. క్రయ విక్రయాలకు వీల్లేని ఈ ప్రాంతంలో ఖాళీ స్థలాలను రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల మధ్యలో బాండ్ పేపర్లపై రాస్తూ కబ్జాదారులు విక్రయిస్తున్నారు. రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని, పాత తేదీలతో ఆక్రమణదారులు ప్రొసీడింగ్‌లను తీసుకుంటున్నారు. ఇదే తరుణంలో నేతల చూపు సైతం ఈ ప్రాంతంపై పడడంతో దాదాపు 90 శాతం ప్లాట్లు అన్యాక్రాంతమైపోయాయి. మరోవైపు కొందరు స్థానిక ఉద్యోగులు ఒక్కక్కరే రెండు, మూడు ప్లాట్లు తీసుకుని భారీ భవనాలను నిర్మిస్తున్నారు.

తప్పుపై తప్పులు చేస్తూ...ఆసిఫాబాద్ పట్టణంలో మూడు అంతస్తుల (జీప్లస్2) వరకే పంచాయతీ అధికారులు అనుమతి ఇస్తారు. ఎన్‌జీఓ కాలనీల్లో కబ్జాలకు గురైన స్థలం రహదారి పొడవునా ఉంటుంది. ఈ స్థలాల్లో ఏకంగా నాలుగు అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నా, పంచాయతీ అధికారులు గమ్మున ఉంటున్నారు. వాస్తవంగా జిల్లా కేంద్రంలో వందలాది గృహాలు నాలుగు అంతస్తులవి నిర్మిస్తున్నా, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా ప్రేక్షకపాత్రకు పరిమితం అవుతున్నారు.

ఏజెన్సీ, అసైన్డ్ భూముల్లోనూ...పట్టణంలోని గుండి వెళ్లే మార్గం పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం. నాలుగు వరుసల రహదారి ఈ ప్రాంతం గుండా వెళ్లడంతో పాటు వీయూపీ (వెహికల్ అండర్ పాసింగ్) ఇక్కడే రావడంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే ఇక్కడ వెంచర్లు వేశారు. ఏకంగా భారీ భవనాలు నిర్మిస్తున్నా రెవెన్యూ, పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగానే ఉంటున్నారు.

అటవీశాఖ చెక్‌పోస్టు ఎదురుగా ఉన్న ప్రాంతమంతా బిలాదాఖల పొరంబోకు భూములే. ఇంటి నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు ఇక్కడ ఇవ్వరు. రిజిస్ట్రేషన్లు సైతం జరగవు. అయినా ఈ ప్రాంతంలో విచ్చలవిడిగా ప్లాట్ల అమ్మకాలు, భవనాలను కడుతున్నారు.

పనులు నిలిపివేస్తాం : రమేశ్, జిల్లా పంచాయతీ అధికారి

అనుమతులు లేకుండా సాగుతున్న ఇంటి నిర్మాణ పనులను నిలిపివేస్తాం. పంచాయతీ నిబంధనల మేరకు జిల్లా కేంద్రంలో జీప్లస్‌టూ వరకే అనుమతులు ఉంటాయి. సిబ్బందితో పరిశీలించి ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం.

# రైతుల ఆశలకు 'గండి'

ఆదిలాబాద్ : భారీ వర్షాలతో జిల్లాలోని చెరువులు నిండి అలుగులపై నుంచి నీరు పారుతున్నాయి. ఉద్ధృతి ధాటికి కొన్నింటికి గండి పడగా, మరికొన్ని దెబ్బతిన్నాయి. కాలువలు కొట్టుకుపోయాయి. అధికారుల లెక్క ప్రకారం 39 ధ్వంసమైనట్లు చెబుతున్నారు. కొన్ని చోట్ల కట్టలు తెగిపోగా, మరికొన్ని కాలువలు దెబ్బతిన్నాయి. మిషన్ కాకతీయ కింద పూడికలు తీయడం, కట్టలు నిర్మించడంతో నీటి వనరులన్నీ నేడు జలకళతో ఉట్టిపడుతున్నాయి. దెబ్బతిన్న చెరువుల్లో మాత్రం నీళ్లు ఖాళీ అయ్యాయి.జైనథ్ మండలం సాత్నాల, మత్తడి వాగు ప్రాజెక్టులకు సంబంధించిన కాలువలు దెబ్బతిన్నాయి. జలాశయాల్లోకి ఎక్కువ వరద చేరడంతో గేట్లు తెరిచి నీటిని వదిలారు. పంట పొలాల్లో నిలిచిన నీటితోపాటు, వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహించడంతో ఆయా ప్రాజెక్టుల కాలువల లైనింగ్ దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల గండి పడటంతో తిరిగి వాటికి మరమ్మతులు చేస్తేనే నీళు విడుదల చేయచ్చు

గతంలో రెండో పంటకు..

జిల్లాలో వంద ఎకరాల్లోపు ఆయకట్టు ఉండే చెరువులు 177 ఉంటే వంద కంటే ఆయకట్టు ఎక్కువగా ఉండే చెరువులు 281 ఉన్నాయి. చెరువుల కింద 80 వేల ఎకరాలకు సాగు నీరందుతుంది. మిషన్ కాకతీయలో భాగంగా నాలుగు విడతల్లో 300కు పైగా వాటి మరమ్మతులు చేశారు. శిథిల కాలువలను బాగు చేశారు. ఏళ్ల తరబడి పేరుకుపోయిన పూడిక తొలగించడంతో నీటి నిల్వ పెరిగి ఆయకట్టుకు నీరందడంతో రైతులు రెండో పంట సాగు చేశారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా చెరువుల్లోకి భారీగా వరద నీరు చేరడంతో రైతుల ఆశలకు గండి పడింది.

నష్టం ఇలా..ఆదిలాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో 100 మిమీలకు పైగా వర్షం కురవడంతో వాగులు వంకల్లోకి భారీగా వరద చేరింది. చెరువులతో పాటు జలాశయాల్లోకి నీరు చేరడంతో గేట్లు తెరిచి నీటిని వదిలేయాల్సి వచ్చింది. మరో వైపు వాగుల ద్వారా చెరువుల్లోకి నీరు చేరడంతో వరద తీవ్రతకు కొన్నింటికి గండి పడ్డాయి. మరి కొన్ని దెబ్బతిన్నాయి.

ఉట్నూర్ మండలంలో అత్యధికంగా 12 దెబ్బతిన్నాయి. నాలుగింటికి గండి పడి భారీ నష్టం జరిగింది. మండలంలోని లక్కారం చెరువు కుడి, ఎడుమ కాలువలు దెబ్బతిన్నాయి. మత్తడివాగు చెరువుకు గండి పడింది.. ఉట్నూర్‌లోని గోపయ్య, సరస్వతి చెరువులు, నాగాపూర్‌లోని శివసాగర్ ప్రాజెక్టు దెబ్బతిన్నాయి.ఇంద్రవెల్లి మండలం ముత్నూర్, డొంగర్‌గావ్, గిన్నెర, వాల్‌గొండ, జైనథ్ మండలంలోని జామిని చెరువు, బజార్‌హత్నూర్ మండలం భూతాయి, దిగ్నూర్, ఇచ్చోడ మండలం గుండాల, నేరడిగొండ మండలం పురుషోత్తమ్‌పూర్, కొండాపూర్, చిక్‌మాన్‌వాగు, కుంటాల, సుర్దాపూర్ తదితర చెరువులు దెబ్బతిన్నట్లుగా అధికారులు గుర్తించారు.

చెరువు ఖాళీ

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరద నీరు చేరి ఉట్నూర్ మండలంలో పలు చెరువులు, ప్రాజెక్టుల దెబ్బతిన్నాయి. వరదలతో మత్తడివాగు చెరువుకు గండి పడింది. కట్టతో పాటు కాలువలు, అలుగు దెబ్బతిన్నాయి. గండి పడటంతో మొత్తం నీరు ఖాళీ అయింది. ప్రస్తుతం ఆయకట్టు రైతులు పంటలు సాగు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. లక్కారం పరిధిలోని మూడు చెరువులు, ఉట్నూర్‌లో రెండు, నాగాపూర్‌లోని శివసాగర్ ప్రాజెక్టు, గన్‌పూర్ ట్యాంకు, భూపాపేట్, దంతెనపల్లి గ్రామాల్లోని వనరులు దెబ్బతిన్నాయి.

మరమ్మతులకు ప్రతిపాదనలు– విఠల్ ఈఈ, ఆదిలాబాద్

జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న చెరువుల మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపించాం. వరద తీవ్రత వల్ల కొన్నింటికి మాత్రమే గండి పడింది. మిగిలినవి దెబ్బతిన్నాయి. తాత్కాలిక మరమ్మతులతో పాటు శాశ్వత పనులకు అవసరమైన నిధులకు ప్రాథమిక అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపించాం.

మొత్తం చెరువులు : 458 సాధారణ నీటి మట్టం కంటే ఎక్కువ నిండినవి : 412 దెబ్బతిన్నవి : 39 జలాశయాలు : 02 నష్టం అంచనా : రూ.20 కోట్లు

మరమ్మతులకు కావాల్సిన నిధులు : రూ. 18.64 కోట్లు

# ఉపాధినిస్తూ.. అండగా నిలుస్తూ..

నిర్మల్ : గిరి వికాసంలో భాగంగా ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు చేపడుతూ వారి ఆర్థిక తోడ్పాటుకు చేయూతనిస్తోంది. తెలంగాణ గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికే నిర్మల్ జిల్లా కేంద్రంలో తేనె శుద్ధి కర్మాగారాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి రాష్ట్రం, దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుండగా.. ఇదే ప్రాతంలో సబ్బుల పరిశ్రమను ఏర్పాటు చేసి మరింత మంది గిరిజనులకు ఉపాధి చూపించింది. రాష్ట్రంలో ఏకైక 'గిరి' సబ్బుల పరిశ్రమ ఇక్కడ ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతంలోని పలువురు ఉపాధి పొందుతున్నారు. రూ.1.60 కోట్లతో..రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ (జీసీసీ) ఆధ్వర్యంలో రూ.కోటితో సబ్బుల పరిశ్రమ ఏర్పాటు చేయడానికి నిర్మల్ జిల్లా కేంద్రంలోని సోఫీనగర్‌లో గోదాం నిర్మించారు. మిగతా రూ.60 లక్షలతో సబ్బుల తయారీకి అవసరమైన యంత్రాలు తీసుకొచ్చారు. ఇందులో పనిచేసే సిబ్బంది, టెక్నీషియన్లుగా గిరిజనులను నియమించి హైదరాబాద్‌కు చెందిన నిపుణులతో శిక్షణనిప్పించారు. ఏడాదిన్నర నుంచి తయారుచేస్తున్న సబ్బులను గిరిజన సంక్షేమశాఖ ద్వారా రాష్ట్రంలోని 584 ఆశ్రమ, గురుకుల విద్యాలయాల



వసతి గృహాల్లో అభ్యసిస్తున్న వారందరికీ అందిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో 5 లక్షల సబ్బులు తయారు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో ఇప్పటికే లక్షకుపైగా సబ్బులు తయారు చేశారు. వీటిని సంబంధిత ఏజెన్సీలకు పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రకృతి సిద్ధమైన..జీసీసీ నిర్వహించిన టెండర్ల మేరకు ముంబయి, బెంగళూరు, తమిళనాడు, దిల్లీ తదితర రాష్ట్రాల నుంచి అవసరమైన ముడిసరకు దిగుమతి చేసుకుంటున్నారు. ప్రకృతి సహజసిద్ధమైన వాటిని వీటి తయారీలో ఉపయోగిస్తున్నారు. మామూలు సబ్బులలో టోటల్ ఫ్యాటీ మ్యాటర్ (టీఎఫ్ఎం) 68 నుంచి 76 శాతం ఉంటుంది. వీరు తయారు చేస్తున్న వాటిలో టీఎఫ్ఎం 78 కలిగి ఉండటం విశేషం. 'గిరి' బ్రాండ్ పేరుతో 150 గ్రాములతో ఒక్కో సబ్బును తయారు చేస్తున్నారు. మేనేజర్, గోదాం ఇన్‌ఛార్జి, టెక్నికల్ అసిస్టెంట్, మిషన్ ఆపరేటర్ల పర్యవేక్షణలో పరిశ్రమ కొనసాగుతోంది. దీని ద్వారా పది మంది పురుషులు, 15 మంది మహిళలకు ఉపాధి పొందుతున్నారు. రోజుకు సుమారు అయిదు వేల సబ్బులు ఉత్పత్తి చేస్తున్నారు. డిమాండ్ అధికంగా ఉంటే రెండు షిఫ్టులుగా పనులు చేయిస్తూ నిత్యం పది వేలు తయారు చేసేలా ప్రణాళికలు రూపొందించారు. వచ్చే విద్యాసంవత్సరానికి అవసరమైన వాటిని ఇప్పటి నుంచే తయారు చేసేందుకు తగిన కార్యాచరణను సిద్ధం చేస్తున్నట్లు నిర్వాహకులు స్పష్టం చేశారు.

కుటుంబానికి ఆసరాగా..– రజని, కార్మికురాలు

నిర్మల్ సమీపంలోని వెంకటాపూర్ గ్రామం మాది. ఇదివరకు బీడీలు చేశా. రెక్కలు ముక్కలు చేసుకుని రోజంతా కష్టపడితే రూ.200 కూడా వచ్చేవి కావు. పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారని తెలుసుకొని దరఖాస్తు చేసుకున్నా. ఇందులో పని లభించడంతో రోజుకు రూ.350 వరకు వస్తోంది. ఇది మాకు ఆర్థికంగా ఎంతో ఉపయోగపడుతోంది.

# వీధి వ్యాపారులకు రుణాల దన్ను

కరీంనగర్ : కొవిడ్–19 లాక్‌డౌన్ కారణంగా చిరు వ్యాపారులు బజారున పడ్డారు.. తిరిగి వ్యాపారాలు చేసుకోవడానికి పైసా లేక.. అప్పులు దొరకక అవస్థలు పడుతున్న వేళ వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి, ఆత్మనిర్భర్ పథకాన్ని ప్రారంభించారు.. పట్టణాలు, నగరాల్లో గుర్తించిన చిరు వ్యాపారులకు రుణాలు ఇచ్చి ఆర్థికంగా దన్నుగా నిలిచారు.. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ప్రారంభించి మూడు సంవత్సరాలు విజయవంతంగా పూర్తి కావడంతో జూన్ 1 నుంచి 3 వరకు దిల్లీలో ఉత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా కథనమిది.. కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలోని 14 పురపాలికలు, 2 నగరపాలికల్లో 65,246 మంది వీధి వ్యాపారులు ఉన్నారు. రోడ్ల మీద, ఫుట్‌పాత్‌లపై పండ్లు, కూరగాయలు, అల్పాహార కేంద్రాలు, వస్త్రాలు, నిత్యావసరాలు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. కరోనా మహమ్మారి వీరి వ్యాపారాలను బాగా దెబ్బతీసింది. లాక్‌డౌన్ తర్వాత వ్యాపారాలు చక్కదిద్దుకునేందుకు చిరు వ్యాపారులు అష్టకష్టాలు పడ్డారు. ఉపాధి లేక, జీవనం గడవక అవస్థలు పడుతున్న చిరు వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా భరోసా కల్పించింది.

మొదట్లో నిరాకరించి : పీఎం స్వనిధి, ఆత్మనిర్భర్ కింద వీధి వ్యాపారులకు బ్యాంకుల ద్వారా నేరుగా రుణాలు అందించేందుకు ముందుకొచ్చారు. రూ.10 వేలు ఖాతాలో జమ చేస్తుండగా ప్రతి నెలా వడ్డీతో సహా కట్టాల్సి ఉండటంతో చిరు వ్యాపారులు మొదట్లో నిరాకరించారు. ఇచ్చే మొత్తం సరిపోదనే భావనతోనే ఉండేవారు. పురపాలక అధికారులు అవగాహన కల్పించడంతోపాటు దగ్గరుండి రుణాన్ని ఇప్పించారు. తర్వాత లక్ష్యాన్ని విధించడం, ఈ మొత్తం రెట్టింపు అవుతుందనే ఆశతో రుణాలు తీసుకోవడానికి చిరు వ్యాపారులు ఆసక్తి



చూపించారు. రూ.10 వేల నుంచి రూ.50 వేలకు.. : పీఎం స్వనిధి కింద మొదటి విడతలో రూ.10 వేలు ఖాతాల్లో జమ చేస్తే, ఈ మొత్తాన్ని ఏడాదిలోగా వడ్డీతో బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుంది. సక్రమంగా చెల్లించిన వారికి మళ్లీ రుణాలు ఇచ్చేందుకు స్వయంగా బ్యాంకర్లే ముందుకొచ్చారు. దాంతో రెండో విడతలో రూ.20 వేలకు అర్హత కల్పించారు. ప్రస్తుతం మూడో విడతలో రూ.50 వేలు అందించేందుకు లక్ష్యాన్ని విధించడంతో అర్హులైన వీధి వ్యాపారులు కూడా ముందుకొస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ మొత్తం మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లుగా చెబుతున్నారు. పీఎం స్వనిధి అమలులో రెండో విడతలో కరీంనగర్ నగరపాలక సంస్థ రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉండగా, దేశంలో పది లక్షల లోపు జనాభాలోని కార్పొరేషన్లలో రెండో స్థానంలో నిలిచింది. మూడో విడతలో కూడా లక్ష్యాన్ని సాధించేలా కసరత్తు చేస్తున్నారు.

అడగకముందే రుణం మంజూరు

రోడ్డుపై దుస్తులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తాను. వీధి వాపార గుర్తింపు కార్డు ఇచ్చారు. ఆ సమయంలో రూ.10 వేలు రుణం ఇప్పించారు. ఈ మొత్తాన్ని బ్యాంకులో చెల్లించడంతో రూ.20 వేలు ఇచ్చారు. ఆ మొత్తాన్ని కూడా చెల్లించడంతో మూడోవిడతకు దరఖాస్తు చేయమని మున్సిపల్ అధికారులు ఫోన్ చేశారు. బయట ఫైనాన్స్ కంటే నయమే. అడగకముందే రుణం మంజూరు చేశారు.

రాజేశం, కరీంనగర్

సమయానికి ఆదుకుంది

లాక్‌డౌన్ సమయంలో పైసలు లేక, పని చేసుకుందామంటే పెట్టుబడి లేక ముప్పు తిప్పలు పడ్డాం. కుటుంబ పోషణ భారంగా మారింది. ఆ సమయంలో తక్కువ వడ్డీతో ఈ రుణం ఆదుకుంది. మూడు విడతలుగా రుణం తీసుకొని చెల్లించా. బ్యాంకు అధికారులు మళ్లీ రుణం ఇస్తామని చెబుతున్నారు. చెల్లించేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని తీసుకోవడం లేదు. అంజయ్య, చెరుకు జ్యూస్ సెంటర్, కరీంనగర్

# మామిడి రైతుకు నష్టాల చేదు

నల్గొండ : మామిడి రైతులు ఈ సంవత్సరం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఎన్నడూ లేనివిధంగా కనీసం పెట్టుబడులు కూడా చేతికందకపోవడంతో మామిడి చెట్లను తొలగించాలనే యోచన చేస్తుండటం ఆందోళనకరంగా మారింది. జిల్లాలో 10,720 ఎకరాల్లో మామిడి తోటలు సాగు చేశారు. మార్చి, ఏప్రిల్ మాసాల్లో కురిసిన అకాల వర్షం.. వడగళ్లు, వీచిన బలమైన గాలులతో 30 శాతానికి పైగా కాయలను నేలరాలడంతో రైతులు నష్టపోయినట్లు అధికారులు గుర్తించారు. సాధారణ పరిస్థితుల్లో జిల్లాలోని సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో 1.05 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి దిగుబడి ఉంటుంది. ఈ సారి 35 వేల మెట్రిక్ టన్నుల కాయలను మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించారు. సీజన్ ముగియనుండగా మరో మూడు, నాలుగు వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాల్సి ఉంది. ఈ లెక్కలను చూస్తే కాపు తగ్గినట్లు తెలుస్తోంది.

వెంటాడిన చీడపీడల బెడద

ఈ సారి మామిడిపైనా చీడపీడల బెడత గణనీయంగా పెరిగింది. తేనెమంచు, బూడిద తెగులు, ఇతరత్రా పురుగులు, తెగుళ్లు తీవ్రంగా ఆశించడంతో కాయలపై మంగు మచ్చలు పెరిగాయి. దేశవ్యాప్తంగా ఎగుమతి తగ్గిందంటూ దిల్లీ వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ముందుకు రాకపోవడంతో ధర అమాంతం తగ్గింది. జిల్లాలో అధికంగా సాగులో ఉన్న బంగినపల్లి రకానికి గతేడాది ఈ సమయానికి క్వింటాకు రూ.3000–4300 ధర ఉండగా ఈసారి రూ.1200–2800 మాత్రమే పలికింది. మంగు మచ్చలున్న కాయలను వేరుచేసి రూ.500–800 ధరకు కొనుగోలు చేస్తున్నారు.

120 ఎకరాల్లో తోటలు మాయం

జిల్లాలో దిగుబడి, ధర గణనీయంగా తగ్గడంతో కనీసం పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొందని రైతులు దిగులు చెందుతున్నారు. మామిడికి వాతావరణ ఆధారిత బీమాను అమలు చేయనందున ప్రకృతి విపత్తుల నష్టానికి ఆర్థిక ఆసరా దక్కలేదు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు జిల్లాలో దాదాపుగా 120 ఎకరాల్లో మామిడి తోటలను నరికివేసి ఇతర పంటల సాగుకు మళ్లుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. పెన్‌పహాడ్ మండలం లింగాలలో 30, చీదెళ్లలో 10, కోదాడ మండలం గుడిబండలో 30, మునగాలలో 30, నూతనకల్ మండలం ఎర్రపహాడ్‌లో 20 ఎకరాల్లో మామిడి తోటలను రైతులు నరికివేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే నాలుగైదేళ్లలో 70 శాతం వరకు మామిడి తోటలు మాయమయ్యే ప్రమాదముంది.

ప్రతిపాదనలు పంపాంరామారావు నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి, సూర్యాపేటజిల్లాలో అకాల వర్షాల కారణంగా నష్టపోయిన మామిడి రైతులకు పరిహారం అందించే విషయమై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే బాధితులకు పరిహారం అందజేస్తాం. మొదటి విడతలో సుమారు 1,400 ఎకరాల్లో మామిడి తోటలు నష్టపోయాయి. ఆరుగాలం కష్టపడి సస్యరక్షణ చర్యలు తీసుకున్నా మామిడి తోటలకు కనీసం పెట్టుబడులు రావడం లేదు. మార్కెట్‌లో దళారులు ఎక్కువగా ఉండటంతో గిట్టుబాటు ధర రాక ఈసారి నష్టపోయిన పెన్‌పహాడ్ మండలానికి చెందిన పలువురు రైతులు 40 ఎకరాల్లో మామిడి తోటలను నరికివేశారు.

# మేల్కోకపోతే ముప్పే!



డోర్నకల్ : వర్షాకాలం ప్రారంభం కానుంది. ఇటీవల వేసవిలో కురిసిన వర్షాలకు మురుగు కాలువలు పొంగిపొర్లి వీధులు జలమయమై ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. జిల్లా కేంద్రంతో పాటు డోర్నకల్, మరిపెడ, తొర్రూరు పురపాలికల్లో కాలువల నిర్వహణ అధ్వానంగా ఉండటంతో పలుచోట్ల రహదారులపై మురుగు నీరు చేరుతుంది. కొత్త మున్సిపాలిటీల అభివృద్ధి కోసం తొలుత ఒక్కొక్క పురపాలిక సంఘానికి ప్రభుత్వం రూ.20 కోట్లు చొప్పున మంజూరు చేసింది. ఈ నిధులతో డోర్నకల్, మరిపెడ, తొర్రూరు మున్సిపాలిటీలలో అవస్థలు తీరుతాయని భావించినా ఫలితం అంతంత మాత్రమే. ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాలో పర్యటించినప్పుడు మహబూబాబాద్ మున్సిపాలిటీకు రూ.50 కోట్లు, మిగిలిన మూడు పురపాలికలకు రూ.25 కోట్లు, ప్రతి పంచాయతీకి రూ.10 లక్షలు చొప్పున కేటాయించిన నిధులతోనైనా అభివృద్ధి జరుగుతుందేమోనని ఎదురు చూస్తున్నారు.

లోపభూయిష్ట పనులతో కష్టాలు

జిల్లాలో కొత్తగా 2018లో డోర్నకల్, మరిపెడ, తొర్రూరు పట్టణాలు పురపాలిక హోదా పొందాయి. పట్టణాల్లో అంతర్గత వీధులు, ప్రధాన వీధుల వెంబడి మురుగు కాలువలు అస్తవ్యస్తంగా ఉండటం ప్రజల పాలిట శాపంగా మారింది. ఇప్పటికీ మురుగు కాలువల్లేని వీధులున్నాయి. కొన్నిచోట్ల ఏళ్ల కిందట కట్టిన కాలువలు పూర్తిగా శిథిలంగా మారాయి.

దృష్టి పెడితే మేలు

జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్, మరిపెడ పురపాలికల్లో భారీ వర్షాలకు అవాస ప్రాంతాలు ముంపునకు గురవుతుండటం అందరిని కలవర పరుస్తోంది. గత వర్షాకాలంతో పాటు ఇప్పుడు వేసవిలో కురిసిన వర్షాలకు ఎదురైన చేదు అనుభవాల నుంచి అధికారగణం గుణపాఠం నేర్చితే బాగుంటుంది. శివారు ప్రాంతాల ముంపు, వీధులు జలమయం వంటి ఘటనలు మళ్లీ జరగకుండా తగు చర్యలు తీసుకోవాలి. అవసరమైన ప్రణాళిక రూపకల్పన జరగాలి.

శివారు ప్రాంతాల్లో ..

ఏటా వర్షాలు కురిసినప్పుడల్లా మహబూబాబాద్ పురపాలిక పరిధిలోని పలు వార్డులు, శివారు ప్రాంతాలు ముంపునకు గురవుతుంటాయి. ప్రధానంగా పట్టణంలోని 18వ వార్డులో గల కొంత భాగం, నిజాం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని గోపాలపురం ముంపు బారిన పడుతున్నాయి. ధర్మన్న కాలనీలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలోకి నీరు ప్రవేశిస్తుండటంతో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య గతంలో అధికారుల దృష్టికి వెళ్లింది. అయినప్పటికీ పరిష్కారంపై ఎవరూ శ్రద్ధ చూపలేదు.

దీర్ఘకాలిక ప్రణాళికతోనే ప్రయోజనం

తొర్రూరు పురపాలిక పరిధిలోని శివారు ప్రాంతాలు భారీ వర్షాలకు ఏటా ముంపునకు గురవుతున్నాయి. తొర్రూరులోని టీచర్స్ కాలనీ పరిసరాలు, వీరప్పనగర్ శివారు ప్రాంతాలు జలమయం అవుతుండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పట్టణంలోని నూతన కాలనీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మన గ్రోమోర్ కేంద్రం నుంచి పాల కేంద్రం వరకు ప్రధాన రోడ్డు ప్రక్కన మురుగు కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు రోడ్డుపైకి వస్తుంది. తాత్కాలిక చర్యలు చేపడుతుండటంతో ప్రయోజనం ఉండటం లేదు. దీర్ఘకాలిక ప్రణాళిక అమలు పరచాలని తొర్రూరువాసులు కోరుతున్నారు.

అలుగుపడితే వరదే

డోర్నకల్ శివారు జయపురంలో ఆవాసాల మధ్య కొర్లకుంట చెరువు ప్రమాదకరంగా ఉంది. అలుగు పడితే నీరు మొత్తం ఇందులోకి చేరుతుంది. గతంలో జయపురం, రైల్వే క్వార్టర్లు, నెహ్రూ వీధి ముంపునకు గురయ్యాయి. ఈ కాలువలో ఇప్పటిదాక పూడిక తీయలేదు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వార్డు కౌన్సిలరు బసిక అశోక్ తెలిపారు. చిన్నపాటి వర్షానికే డోర్నకల్‌లోని కుందోజు వారి వీధి జలమయమవుతోంది. పట్టణంలో ముంపు నివారణకు అవసరమైన చర్యలు చేపడతామని పుర కమిషనర్ మున్వర్‌అలీ తెలిపారు. ఇప్పటికే కొంత మంది కౌన్సిలర్లు సమస్య తీవ్రత గురించి తన దృష్టికి తీసుకొచ్చారన్నారు.

మరిపెడలో అంతంతే!

మరిపెడ పట్టణంలో కార్గిల్ కూడలి నుంచి వరంగల్ మార్గంలో జాతీయ రహదారికి ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణం చేపట్టలేదు. దీంతో చిన్నపాటి వర్షానికే కార్గిల్ కూడలిలో చెరువును తలపించేలా మురుగు నీటితో పాటు వర్షపు నీరు చేరుతోంది. దీంతో పలుమార్లు వాహనాల రాకపోకలు సైతం స్తంభించాయి. రహదారిపై గంటల తరబడి నీరు నిల్వ ఉండి గుంతలమయంగా మారుతోంది. పట్టణంలోని గిరిజన ఆవాస ప్రాంతాల్లోని వీధుల్లో అంతర్గత రోడ్లు నిర్మించి మురుగు కాలువల ఏర్పాటు చేయకపోవడంతో సీసీ రోడ్లు దెబ్బతింటున్నాయి. గ్యామాతండ, పూలబజార్, గాంధీ బజార్ ఎస్సీ కాలనీ సీతారాంపురం, కొత్తతండా, బొత్తలతండాలో మురుగు కాలువల సుమారు 8 వేల మీటర్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

# ప్రగతి పరుగు!

కరీంనగర్ : ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలక పోరాటాన్ని సాగించిన ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి విషయంలో ప్రత్యేక ముద్ర కనిపిస్తోంది.. పథకాల ద్వారా అందిన సంక్షేమంతోపాటు ప్రత్యేకత నిలిపే అభివృద్ధి కూడా సాకారమైంది.. సాగుకు దన్నుగా నిలిచేలా ప్రాజెక్టులు.. విద్యా రంగంలో తెలంగాణ మార్కు చూపించేలా కేజీ టు పీజీ ప్రాంగణంతోపాటు వైద్య సేవల మెరుగుకు వైద్య కళాశాలల ఏర్పాటు రాష్ట్ర ఆవిర్భావం తరవాత ఉమ్మడి జిల్లాకు వన్నె తెస్తున్నాయి.. రేపటి నుంచి తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు నాలుగు జిల్లాలు ముస్తాబైన నేపథ్యంలో ఇన్నాళ్లు దరిచేరిన అభివృద్ధి మరింత ముందుకు సాగాలని ఆశిద్దాం..

చదువుల అడ్డా.. 'కేజీ టు పీజీ'.!

రాష్ట్రంలో కేజీ టు పీజీ హామీని నెరవేర్చేలా అక్షర ఖ్యాతిని అందించిన బడి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేటలో నెరవేరింది. గత విద్యా సంవత్సరం నుంచి ఇక్కడ అంగన్వాడీ నుంచి పీజీ విద్య వరకు చదువును అందించే విద్యానిలయంగా ఇది భాసిల్లుతోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయ స్వప్నంగా పేరొందిన కేజీ టు పీజీ ప్రాంగణాన్ని చిన్నపాటి విశ్వవిద్యాలయాన్ని తలపించేలా లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించారు. కిండర్ గార్డెన్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొట్టమొదటి ప్రాంగణమిది. ఇక్కడ మొత్తంగా 2,500ల మందికిపైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద పలు సంస్థలు చేసిన సాయం, ప్రభుత్వ నిధులు దాదాపుగా రూ.8.5 కోట్లు ఖర్చు పెట్టి చూడచక్కని సౌకర్యాలు, వసతులతో ఆహ్లాదభరితమైన బడిగా నిర్మించారు. రెండేళ్ల నుంచి ఆరేళ్ల వరకు వయస్సున్న వారికి అంగన్వాడీ కేంద్రంలో ఆటపాటలతో 12 గదుల్లో ప్రత్యేక బోధనను అందిస్తున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఇదే ప్రాంగణంలో ఉన్నాయి. జూనియర్, డిగ్రీ, పీజీలో పలు కోర్సులతోపాటు దూరవిద్యకోర్సులను అందుబాటులోకి తెచ్చారు. అతిపెద్ద గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి ఒకేసారి 100 మంది కూర్చునే సౌకర్యాన్ని కల్పించారు. నైపుణ్య శిక్షణను అందించే కేంద్రాన్ని ఏర్పాటు చేసి కుట్టు మిషన్‌తోపాటు ఇతర కులవృత్తులకు చేయూతనిచ్చే సౌలభ్యాన్ని ఇక్కడి బడిలో అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలో భవిష్యత్తు చదువుల లోకానికి దీన్ని ఒక నమూనాగా మార్చారు.

వైద్య కళాశాలలతో మేలుప్రజారోగ్యానికి పెద్దపీట వేసేవిధంగా సర్కారు దవాఖానాలు ఇంతకింతకు బలోపేతమవుతున్నాయి. 9 ఏళ్లలో వైద్య చికిత్సల పరంగా ఊహించని సౌకర్యాలు, సౌలభ్యాలు రోగులకు చేరువయ్యాయి. ఈ సేవలకు అనుబంధంగా కొత్త వైద్య కళాశాలలు నాలుగు జిల్లాలకు మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల వ్యవధిలోనే కరీంనగర్, సిరిసిల్ల, రామగుండం, జగిత్యాలలో వైద్య కళాశాలలను మంజూరు చేసి ఇక్కడి ప్రజల చిరకాల కోరికను తీర్చింది. బోధనేతర సిబ్బంది, వైద్య సిబ్బంది నియామకాలు జిల్లాల్లోని వైద్యసేవల్ని మరింత బలోపేతం చేయనున్నాయి.

జలకళనద్దిన కాళేశ్వరం

ఎస్సారెస్పీ కాలువలు ఉన్న ప్రాంతం తప్పితే మిగతా చోట్ల సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొన్న ఉమ్మడి కరీంనగర్‌లో సరికొత్త జలదృశ్యం ఆవిష్కృతమైంది. ఒకప్పుడు కరవు కోరల్లో చివరి తడి నీటి కోసం ఆందోళనలు చేసిన గడ్డ.. ఇప్పుడు జలాశయాల ఖిల్లాగా మారిపోయింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మాణం జరిగింది ఉమ్మడి జిల్లా పరిధిలోనే. రూ.లక్ష కోట్లతో నిర్మితమైన ఈ ప్రాజెక్టు తొలి సాగునీటి ఫలాలు ఉమ్మడి జిల్లాకు అందాయి. మేడిగడ్డ (లక్ష్మీ బ్యారేజీ) నుంచి ఎత్తిపోసే నీరు అన్నారం (సరస్వతి) బ్యారేజీ మీదుగా పెద్దపల్లి జిల్లా సుందిళ్ల (పార్వతి) బ్యారేజీ, పంప్‌హౌజ్‌ల నుంచి ఎల్లంపల్లికి చేరుతుంది. అటు నుంచి నందిమేడారం, గాయత్రి పంప్ హౌజ్ మీదుగా మధ్యమానేరు జలాశయానికి వెళ్తాయి. సుందిళ్ల (పార్వతి) బ్యారేజీని మంథని మండలం కాసిపేట శివారులో నిర్మించగా జలాశయంలో 8 టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది. సమీపంలోని గోలివాడ వద్ద నిర్మించిన పంప్‌హౌజ్ ద్వారా ఎల్లంపల్లికి నీటిని ఎత్తిపోస్తారు. తెలంగాణ ఏర్పాటు తర్వాతే బోయినపల్లి మండలంలోని మధ్యమానేరు జలాశయం నిర్మాణం వేగంగా పూర్తి చేసుకుంది. నీటి సామర్థ్యం 25 టీఎంసీలు కాగా, ఈ జలాశయం ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని చెరువులన్నింటిని నింపడంతో ఈ ఒక్క జిల్లాలోనే దాదాపు 2 లక్షల సాగుకు ఆధారమవుతోంది. రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌజ్ నుంచి వచ్చే నీటితో కరీంనగర్ జిల్లాలోని పలు గ్రామాలకు కాళేశ్వరం తొలిఫలాలు అందాయి. 2017 వానాకాలంలో 6 లక్షల ఎకరాలు సాగైతే గత వానాకాలంలో కాళేశ్వరం జలాల పుణ్యమా అని దాదాపుగా 10లక్షల ఎకరాల్లో పలురకాల పంటల్ని రైతులు సాగుచేశారు.

కాళేశ్వరం జలాలతో వరద కాలువ నుంచి ఎస్సారెస్పీ(శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్)కు పునరుజ్జీవ పథకం ద్వారా నీళ్లను అందించారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్, మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావు పేటల వద్ద పంప్‌హౌజ్‌లను నిర్మించారు. వరద కాలువలోకి వీటి ద్వారా ఎస్సారెస్పీకి రివర్స్ పంపింగ్‌ను అవసరమున్నప్పుడు చేస్తున్నారు. దీని ద్వారా వరద కాలువలో అటు ఎస్సారెస్పీ ఇటు కాళేశ్వర జలాలు ఉండటంతో సమీప గ్రామాల సాగుకు ఇది జీవనాధారమవుతోంది.

# ఆ అధికారి రూటే.. సపరేటు..!

నల్గొండ : రాజధానికి దగ్గరగా ఉండటంతో ఇక్కడ స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. అనుమతుల్లేకుండా విచ్చలవిడిగా సాగుభూములను వెంచర్లుగా మారుస్తున్నారు. వీటికి సదరు అధికారి మద్దతుగా ఉండటంతో స్థిరాస్తి వ్యాపారులు ఆడింది ఆటగా సాగుతోంది. ఇక్కడ అక్రమాలకు పాల్పడుతున్నారని మండల ధరణి ఆపరేటర్‌ను, కంప్యూటర్ ఆపరేటర్‌ను ఇటీవలే జిల్లా ఉన్నతాధికారులు ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. అయితే రెండు, మూడు రోజుల్లోనే సదరు కంప్యూటర్ ఆపరేటర్‌ను తిరిగి అదే ప్రాంతానికి బదిలీ చేయాలని ఓ నేత ఒత్తిడి చేయగా.. జిల్లా అధికార యంత్రాంగం ఆ ప్రతిపాదనకు ఒప్పుకోలేదని తెలిసింది. ఇక్కడ జరిగే అక్రమాలకు నియోజకవర్గ ప్రజాప్రతినిధి మద్దతు ఉందనేది బహిరంగ రహస్యం. ఈ కారణాలతోనే సదరు అధికారిని ఇక్కడి నుంచి బదిలీ చేయడానికి ఉన్నతాధికారులు ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది.

ఇవిగో దృష్టాంతాలు..

ఓ మాజీ ఎమ్మెల్యేకు మండల కేంద్రం సమీపంలో సుమారు 30 ఎకరాల వరకు భూమి ఉంది. దీనిని కొంత కాలం క్రితం హైదరాబాద్‌కు చెందిన వారికి విక్రయించారు. ఈ స్థలంలో వారు వెంచర్ నిర్మాణం చేపట్టారు. గ్రామ కార్యదర్శిని వెంచర్ నిర్మాణ అనుమతుల గురించి అడగ్గా.. తమను సంప్రదించలేదని సదరు అధికారి వెల్లడించడం గమనార్హం. ఇలా ఎలాంటి అనుమతులు లేకుండానే వెంచర్ల నిర్మాణం సాగుతున్నా అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో జోగుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇక్కడ కొసమెరుపు ఏంటంటే వెంచర్ నిర్మాణం చేపడుతున్న స్థలంలో చెక్‌డ్యాంలు ఉన్నాయి. గతంలో ప్రభుత్వ భూమిలోనే చెక్‌డ్యాంలను సర్కారు నిర్మించిందనే వాదనలుండగా.. అధికారులు, స్థల యజమానులు మాత్రం ప్రైవేటుగా తామే చెక్‌డ్యాం నిర్మాణాన్ని చేపట్టినట్లు వెల్లడిస్తుండటం గమనార్హం.

మండలంలోని ఓ మహిళా రైతు 1.07 ఎకరాలను కొనుగోలు చేసి మ్యుటేషన్ చేయించుకోగా.. ఆన్‌లైన్‌లోనూ నమోదైంది. అయితే ఈ భూమి పక్కనే ఉన్న బడా బాబుల ఒత్తిడితో సదరు మహిళా రైతుకు డిజిటల్ సంతకం చేయలేదు. రెండున్నరేళ్లుగా తిరుగుతున్నా పట్టించుకోకపోవడంతో సదరు రైతు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ఈ పరిణామంపై సదరు అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఇటీవలే డిజిటల్ సంతకం చేశారు.

ఇదే మండలంలోని ఓ గ్రామంలో 14.10 ఎకరాల భూమిని నాలా భూమిగా మార్చారు. ప్లాట్లు చేసి అమ్ముడుపోకపోవడంతో దీనిని తిరిగి వ్యవసాయ భూమిగా మార్చేందుకు సదరు స్థిరాస్తి వ్యాపారులు నిర్ణయించగా.. అధికారి ఈ 14.10 ఎకరాలకు పాసుపుస్తకాలను మంజూరు చేసినట్లు తెలిసింది.

నల్గొండ జిల్లాలో.. మారుమూల ప్రాంతంగా పేరొందిన నియోజకవర్గంలోని మండలమది. రాజధానికి దగ్గరగా ఉండటం, హైదరాబాద్ – నాగార్జునసాగర్ రహదారిపై మండల కేంద్రం ఉండటంతో అక్కడి భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇప్పుడిదే అక్కడి అధికారికి వరమైంది. ధరణి లోపాలను అడ్డుపెట్టుకొని విచ్చలవిడిగా ప్రతి పనికి ధర నిర్ణయించి అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బులిస్తే భూమి లేని వారి పేరిట అయినా పాసుపుస్తకాలు వస్తున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ప్రభుత్వ భూములు హాంఫట్..!

మండలంలోని ప్రభుత్వ భూములను ఇక్కడి ప్రజాప్రతినిధి అధికారి సాయంతో చెరబట్టినట్లు తెలిసింది. సుమారు 32 ఎకరాలు ప్రభుత్వ, అసైన్డ్ భూములను సదరు ప్రజాప్రతినిధి బినామీలు, స్థానికంగా ఉండే మరో ప్రజాప్రతినిధి పేర్లతో నమోదైనట్లు విశ్వసనీయ సమాచారం. ఈ ప్రభుత్వ భూముల విలువ రూ.కోట్లలోనే ఉంటుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మండలంలో ఎక్కడ ప్రభుత్వ, అసైన్డ్ భూములున్నాయో సదరు అధికారి ప్రజాప్రతినిధికి చెప్పడం, బినామీ పేర్లతో సదరు నేత దక్కించుకోవడం గత మూడు నాలుగేళ్లుగా నడుస్తోంది. మూడు, నాలుగు నెలల కింద ఇదే మండలంలోని విలువైన ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిని సైతం నియోజకవర్గ నేత కుటుంబానికి చెందిన బినామీ పేర్లతో ధరణిలో నమోదు చేసినట్లు సమాచారం. రూ.కోట్ల విలువైన భూములను తన పరం చేయడంతో సదరు అధికారిని ఎక్కడికి బదిలీ చేయడానికి ఆ నేత ఒప్పుకోవడం లేదని తెలిసింది. సమగ్ర విచారణ చేసి తప్పుంటే చర్యలు తీసుకుంటాం

వినయ్ కృష్ణారెడ్డి, కలెక్టరు, నల్గొండ

అనుమతులు లేకుండా వేస్తున్న వెంచర్‌లో చెక్‌డ్యాంలు ఉన్నాయనే దానిపై సమగ్ర విచారణ చేస్తాం. ఆ చెక్‌డ్యాంలు ప్రభుత్వ స్థలంలో ఉన్నాయా? ప్రైవేటుగా నిర్మించుకున్నారనే దానిపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపిస్తాం. ఈ వ్యవహారంలో ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులందరిపై చర్యలు తీసుకుంటాం.

# త్వరలో.. పురపాలికల్లో ఆధునిక ధోబీఘాట్లు

నల్గొండ : రజకుల కులవృత్తికి సాంకేతిక హంగులను మేళవించి ఆధునిక ధోబీఘాట్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రజకులకు ఉపాధే లక్ష్యంగా ప్రభుత్వం ఇప్పటికే విద్యుత్తు ఇస్త్రీ పెట్టెలు పంపిణీ చేసింది. ఉచితంగా కరెంటు సరఫరా చేస్తోంది. దేశవ్యాప్తంగా ఇప్పటికే స్మార్ట్ నగరాల్లో చేపట్టిన ఆధునిక ధోబీఘాట్ల సేవలు విజయవంతం కావడంతో.. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కూడా తెలంగాణలో అన్ని పట్టణాలు, నగరాలు, పురపాలికల్లో ధోబీఘాట్ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 19 పురపాలికలకు మంజూరు చేస్తూ ఇటీవలే ఆదేశాలు జారీ చేసింది. రూ.2 కోట్ల చొప్పున..నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల పరిధిలో 19 పురపాలికలు ఉన్నాయి. ప్రతి పట్టణంలో ఒక్కో ధోబీఘాటు నిర్మాణానికి టీయూఎఫ్ఐడీసీ పథకం ద్వారా రూ.రెండు కోట్ల చొప్పున ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. ఆయా పురపాలికల్లో యాంత్రీకరణతో కూడిన ధోబీఘాట్ల నిర్మాణాలకు స్థల సేకరణ పూర్తి చేసి ప్రజారోగ్యశాఖకు అప్పగించంతో అధికారులు టెండర్ల ప్రక్రియ చేపట్టారు.

సత్వర సేవలు..ఆధునిక ధోబీఘాట్లలో పెద్దపెద్ద యంత్రాలు ఏర్పాటు చేయనుండటంతో ఒకేసారి 100 జతలకు పైగా దుస్తులు ఉతికే సామర్థ్యం ఉంటుంది. వాటిని ఇస్త్రీ చేయడం కూడా ఆధునిక పద్ధతే కావడంతో రజకులకు సమయం వృథా కాకుండా సత్వర సేవలను అందించే అవకాశం ఉంటుంది. పట్టణాల్లో ఏర్పాటు చేస్తున్న ఆస్పత్రులు, వసతిగృహాలు ఎక్కువ సంఖ్యలో దుస్తులు, దుప్పట్లు ఉతికించేందుకు ధోబీఘాట్లను ఆశ్రయిస్తున్నారు. తద్వారా రజకులకు ఉపాధి అవకాశాలు మెరుగు పడే అవకాశం ఉంది.

త్వరలో పనులు ప్రారంభంసత్యనారాయణ, ఈఈ, ప్రజారోగ్యశాఖ ఆధునిక ధోబీఘాట్ల నిర్మాణాలకు సంబంధించి టెండర్ల ప్రక్రియ ప్రారంభించాం. త్వరలోనే పనులు ప్రాంరభించి ఈ ఏడాది చివరి నాటికి సేవలను అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం.

# ఏఎన్ఎంలకు రక్తపోటు పరీక్షల కిట్లు

జనగామ : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వం మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వైద్య సిబ్బంది ఇళ్లకే వచ్చి ప్రజల రక్తపోటు స్థాయిని పరీక్షించి ఏ మందులు వాడాలో సూచిస్తారు. సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు రక్తపోటు, మధుమేహం వంటి రుగ్మతలు వస్తున్నాయి. వీటిని సకాలంలో గుర్తించక ఇతర అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. బాధితులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు ఏఎన్ఎంలకు డిజిటల్ రక్తపోటు నిర్ధారణ కిట్లను అందించి ప్రజలను చైతన్యవంతం చేయాలని ప్రభుత్వం సంకల్పించింది.

**జిల్లాకు చేరిన పరికరాలు**

ఈ పరికరాలు జనగామ జిల్లా కేంద్రానికి చేరాయి. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వీటిని ఏఎన్ఎంలకు అందజేయనున్నారు. జిల్లాలో సుమారు 150 మంది ఏఎన్ఎంలు ఉన్నారు. ప్రస్తుతం గర్భిణుల ఆరోగ్య పరిరక్షణలో వీరు చురుకైన పాత్ర పోషిస్తున్నారు. దీనికి తోడుగా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రజలకు రక్తపోటు పరీక్షలు చేస్తారు. బాధితుల వివరాలను సేకరించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అందజేస్తారు. ఆరోగ్య కేంద్రాలకు చేరాక అక్కడి వైద్యులు బాధితులను మరోసారి పరీక్షించి వివరాలు నమోదు చేసుకొని ప్రత్యేక గుర్తింపు



సంఖ్య కేటాయిస్తారు. అవసరమైన మందులను అందిస్తారు.

**ఇప్పుడేం జరుగుతోంది?**

బాధితులు ఆసుపత్రుల్లో చేరిన తర్వాత రక్తపోటును నిర్ధారించి మందులు ఇస్తున్నారు. ప్రతి మూడు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకొని మందులను వైద్యుడికి చూపించాలని చెబుతున్నా.. బాధితులు పెద్దగా పట్టించుకోవడం లేదు. కనీసం రక్తపోటు స్థాయిని కూడా గమనించలేకపోతున్నారు. దీంతో జీవన శైలిపై తీవ్ర ప్రభావం చూపి ఒక్కోసారి ప్రాణాల మీదికి వస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

**ఇకపై ఇలా..**

ఏఎన్ఎంలకు డిజిటల్ బీపీ యంత్రాలను అందించడంతో వారు బాధితులను గుర్తించి వారి వివరాలను పీహెచ్‌సీకి పంపిస్తారు. అక్కడి వైద్యులు మరింత లోతుగా పరీక్షించి మందులు రాస్తారు. వీటిని క్రమం తప్పకుండా వాడేలా ఏఎన్ఎంలు కుటుంబ సభ్యులకు వివరిస్తారు. వారు రోజూ మందులు వేసుకుంటున్నారో లేదో ఆరా తీస్తారు. ప్రతి మూడు నెలలకోసారి పరీక్షలు చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపిస్తారు. మందులు కొనసాగించాలా మార్చాలా అన్నది అక్కడి వైద్యులు సూచించి మందులు అందిస్తారు.

**ఈ కార్యక్రమంతో బాధితులకు ఉపశమనం**

**– ప్రశాంత్, జిల్లా వైద్య ఆరోగ్యాధికారి**

ఏఎన్ఎంలకు బీపీ పరీక్షల కిట్లు ఇవ్వనున్నట్లు సమాచారం అందింది. చాపకింద నీరులా విస్తరిస్తున్న రక్తపోటును గుర్తించి మందులు వాడకుంటే పెను ప్రమాదాలకు దారి తీస్తుంది. ప్రభుత్వ విధానంతో చాలామంది రక్తపోటు బాధితులకు ఉపశమనం కలుగుతుంది.

# నిర్వహణ ఖర్చులు పెరిగాయ్..!

భూపాలపల్లి : పోషకాహారం తీసుకోని చాలా మందిలో రక్తహీనత, తక్కువ బరువు, తరుచు అనారోగ్య సమస్యలు రావడం జరుగుతుంది. ఇలాంటి పరిస్థితి నుంచి ప్రజలను బయట పడేసేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. వాటి ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. నిత్యవసర సరకుల ధరలు పెరడంతో ఈ కేంద్రాల నిర్వాహకులు అదనపు ఖర్చులు భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ధరలు వందల్లో... చెల్లించేది రూపాయల్లో...**

అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణి, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం నుంచి తక్కువ మొత్తంలో చెల్లింపులు చేస్తున్నారు. నిత్యావసర ధరలు పెరిగినా ప్రభుత్వం చెల్లింపులు మాత్రం పెంచలేదు. కేంద్రంలో బియ్యం, పప్పు. కోడిగుడ్లు ప్రభుత్వం నుంచి



సరఫరా అవుతున్నా వాటిని వండటానికి కావాల్సిన సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. వంటకు కావాల్సిన వస్తువుల కోసం రోజుకు గర్భిణి, బాలింతలకు 2.10రూపాయలు, పిల్లలకు 0.95 పైసలు ప్రభుత్వం చెల్లిస్తున్నది. ఈ మొత్తం ప్రస్తుత ధరలకు ఏమాత్రం సరిపోక అదనపు భారం తమపై పడుతోందని కేంద్రం నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు చాలా వరకు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. భూపాలపల్లి పట్టణంలో రెండు గదులు ఉన్న ఇంటికి రూ.3వేలకు పైగా అద్దె ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1500 పైనే ఉంటుంది. కాని ప్రభుత్వం మాత్రం వెయ్యి రూపాయలే చెల్లిస్తున్నది. వంట గ్యాస్‌కు సంబంధించి ఒక్కో పిల్లవానికి 20 పైసలు, బాలింతలు, గర్భిణిలకు 30 పైసలు మాత్రమే చెల్లిస్తుంది. ప్రస్తుతం గ్యాస్ సిలండర్ రూ.1200 ఉన్నది. అదనంగా స్టేషనరీ, ఇతర ఖర్చులు పెరగడంతో కేంద్రాల నిర్వహణ భారమైంది. దశాబ్దం క్రితం నాటి ధరలే ఇప్పుడు చెల్లిస్తున్నారని అంగన్‌వాడీ సిబ్బంది వాపోయారు.

**నిబంధనల మేరకు చెల్లిస్తున్నాం..**

**– శైలజ, ఇన్‌ఛార్జి డీడబ్ల్యూవో**

జిల్లా వ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో లబ్ధిదారులకు నిబంధనల మేరకు పౌష్టికాహారం అందేలా కృషి చేస్తున్నాం. నిత్యావసర సరుకుల సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే బిల్లులు చెల్లిస్తున్నాం.

# రాముడి జాగలో అక్రమార్కుల పాగా..!



భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి భూముల పాత దస్త్రాలకు పట్టిన దుమ్మును సిబ్బంది దులుపుతున్నారు. రాముల వారి పేరిట తెలుగు రాష్ట్రాల్లో సుమారు 1,300 ఎకరాల భూమి ఉంది. ఇందులో ఎక్కువ భాగం ఆక్రమణకు గురైంది. పాత దస్త్రాలను దేవాదాయశాఖ పరిశీలిస్తుండటంతో ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. భద్రాచలంలో ఆలయానికి సమీపంలో మరింత జాగా రాములోరికి ఉందనే చర్చ జోరుగా సాగుతోంది. ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న రూ.కోట్ల స్థలం ఆలయానికి దక్కితే భవిష్యత్తు అవసరాలకు ఇబ్బంది ఉండదనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. అంతా చట్ట ప్రకారం ఉండేలా దేవస్థానం అధికారులు సమాలోచన సాగిస్తున్నారు.

పాత దస్త్రాల ప్రకారం భద్రాచలం ఆలయ సమీపంలోని స్థలాలు ఎవరివో గుర్తించాలనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఈఓలుగా విధులు నిర్వర్తించిన చంద్రశేఖర్ ఆజాద్, రమేశ్‌బాబు, ప్రభాకర శ్రీనివాస్ తదితరులు ఈ స్థలాలపై ప్రాథమికంగా సర్వేలు జరిపారు. ఇవి తమ భూములేనని ప్రైవేట్ వ్యక్తులు పట్టాలు చూపించడంతో సర్వేలన్నీ బుట్టదాఖలయ్యాయి. మరోసారి ఈస్థలాలపై అధికారులు దృష్టిసారించారని సమాచారం. రెవెన్యూ, దేవాదాయశాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**భవిష్యత్తు అవసరాలు..**

ప్రస్తుతం రోజుకు 700 నుంచి 1,200 మందికి అన్నదానం చేస్తున్నారు. అన్నదానం నిమిత్తం రూ.40 కోట్ల నిధులు ఉన్నందున రోజుకు 2 వేల మందికి భోజనాలు వడ్డించవచ్చు. సరిపడా సిబ్బందిని నియమించుకొని సత్రం విశాలంగా ఉండేలా చూడాలి. ఇందుకోసం ఇంకొంత స్థలం అవసరం.

35 వేల మంది కల్యాణ మండపంలో కూర్చొని శ్రీరామనవమి ఉత్సవాలను వీక్షిస్తున్నారు. ఐదు దశాబ్దాల క్రితం అవసరాలకు ఈప్రాంగణం సరిపోయేది. ఇప్పుడు మండపాన్ని మార్చడం కుదరకపోవచ్చు. దీన్ని అలాగే ఉంచి ప్రాంగణం విస్తీర్ణం పెంచాలంటే ఇంకొంత భూమి కావాలి.

రానున్న రోజుల్లో వెయ్యికాళ్ల మండపం ఏర్పాటు చేయాలన్నా అదనంగా భూమి అవసరమవుతుంది. రూ.42 కోట్ల పర్యాటక పనులకు ఇప్పటికే స్థల సేకరణ ప్రక్రియ పూర్తయ్యింది.

ప్రభుత్వం ఇంతకుముందు ప్రకటించిన విధంగా రూ.150 కోట్లతో పనులు చేపట్టాలంటే మరింత స్థలం కావాలి. నది పర్యాటకం (రివర్ టూరిజం)లో భాగంగా బాసర నుంచి భద్రాచలం వరకు లాంచీలను గోదావరిలో తిప్పాలనే చర్చ సాగుతోంది. ఈ విధానం విజయవంతమైతే భద్రాచలం, పర్ణశాల వద్ద కుటీరాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

రంగనాయకుల గుట్టపై ఆధ్యాత్మిక వాతావరణం పరిఢవిల్లాలంటే ఆక్రమణలను అడ్డుకోవాలి.

రామాలయం ఎదురుగా కొలువైన నరసింహస్వామి ఆలయానికి విశిష్టత ఉంది. ఈ కోవెలకు పైవంతెన నిర్మించేందుకు వైదిక పెద్దలతో చర్చించాల్సి ఉంది.

రామాలయం స్థలం ఎక్కడ ఉన్నా ఆక్రమణకు గురికాకుండా కాపాడుకుంటాం. అన్నదానం విస్తరణకు చర్యలు తీసుకుంటున్నాం. దేవస్థానం స్థలాలు ప్రైవేటు వ్యక్తుల వద్ద ఉంటే అప్పగించాలని అడుగుతాం. నిబంధనలు పాటించాలని సూచిస్తాం. ఇప్పటికే ఈదిశగా చర్యలు చేపట్టాం. రమాదేవి, ఈఓ, భద్రాచలం రామాలయం

# పాలు.. ఆరోగ్యానికి మేలు




ఖమ్మం : ఏటా జూన్ 1న ప్రపంచవ్యాప్తంగా క్షీర దినోత్సవం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. 100 శాతం పోషక విలువలు, విటమిన్ బి–12 అధికంగా కలిగిన ఇవి యుక్త వయసు పిల్లల్లో, విద్యార్థుల్లో, మానసిక, శారీరక ఉత్సాహాన్ని, పెరుగుదలను, ఎముకల పటుత్వాన్ని పెంచుతాయి. రానురాను వాతావరణ సమతుల్య లోపం, వర్షాలు లేక, గ్రాసం కొరతతో పశుపోషణ కష్టమైంది. పాల ఉత్పత్తి తగ్గిపోతోంది. దీన్నో వ్యాపార వస్తువుగా మలచుకుని అనేక ప్రైవేటు డెయిరీలు పుట్టుకొస్తున్నాయి. వీటిలో నిల్వ కోసం అనేక రకాల రసాయనాలు కలుపుతున్నారు. దీంతో పోషకాల సంఖ్య సైతం తగ్గిపోతోంది.

**పుట్టగొడుగుల్లా...**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనేక ప్రైవేటు డెయిరీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. రకరకాల ఆఫర్ల ఎర చూపించి రైతుల నుంచి పాలను సేకరిస్తున్నాయి. దీనికి తోడు పొరుగు రాష్ట్రాలకు చెందిన అనేక డెయిరీలు జిల్లాను ముంచెత్తుతున్నాయి. దీంతో ప్రభుత్వ రంగ సంస్థ, తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ సహకార సమాఖ్యకు చెందిన విజయ డెయిరీ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. నాణ్యమైన పాలకు మారుపేరుగా నిలిచిన ఈ సంస్థ మనుగడ ఇప్పుడు కష్టమవుతోంది.

**పాల ఉత్పత్తులు పెంచేందుకు కృషి... – డాక్టర్ ఎ.కుమారస్వామి, ఉప సంచాలకుడు, విజయ డెయిరీ, ఉమ్మడి ఖమ్మం జిల్లా**

పాడి రైతులకు నూతన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించటం ద్వారా పాల దిగుబడిని 25 నుంచి 30 శాతం వరకు పెంచే అవకాశం ఉంది. విజయ డెయిరీ, ఎస్‌బీఐ, పాడి రైతులతో కలిపి ఒక త్రైపాక్షిక ఒప్పందాన్ని ఏర్పాటు చేసింది. దీని ద్వారా రైతులు పాడి పశువులను కొనుగోలు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఎలాంటి సెక్యూరిటీ లేకుండా బ్యాంకులు రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలను అందిస్తాయి. ఒకటి నుంచి మూడు పాడి పశువుల కొనుగోలు నిమిత్తం రుణాలు అందిస్తారు. రైతుల పాల బిల్లులో ఈ రుణాలను మినహాయించుకుంటారు. కొత్తగా 15 పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశాం.

# పల్లెపల్లెన.. ప్రగతి చాటేలా..

ఖమ్మం : తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. జూన్ 2 నుంచి 21 రోజుల పాటు వేడుకలు జరిపేందుకు కార్యాచరణ రూపొందించింది. పల్లె నుంచి జిల్లా స్థాయి వరకు పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు గడిచిన తొమ్మిదేళ్లలో ప్రభుత్వం అమలుపరుస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించనున్నారు.

**నాడు– నేడు.. అభివృద్ధిని చూడు..**

రైతు, విద్యుత్తు, పారిశ్రామిక, సాగునీరు, సంక్షేమం, పరిపాలన, సాహిత్యం, ఆధ్యాత్మికం, వైద్యారోగ్యం, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, తదితర రంగాల్లో గడిచిన తొమ్మిదేళ్లలో సాధించిన ప్రగతిని ఊరూరా చాటిచెప్పేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. జిల్లాల వారీగా ప్రగతి నివేదికలు విడుదల చేయడంతోపాటు పల్లెల వారీగా ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గ్రామసభలు, సమావేశాల ద్వారా చాటిచెప్పనుంది. రాష్ట్రావతరణకు ముందు, ఆతర్వాత పరిస్థితులను కళ్లకు కట్టేలా వివరించనుంది. ఇప్పటికే ఆత్మీయ సమ్మేళనాల పేరిట మూడు నెలలుగా అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతులతో చెరువు కట్టలపై సహపంక్తి భోజనాలు చేయనున్నారు.

**3న రైతు వేదికల్లో వేడుకలు**

జూన్ 3న 'రైతు దినోత్సవాన్ని' రైతు వేదికల్లో అట్టహాసంగా నిర్వహించనున్నారు. ఆయా పంచాయతీ కార్యాలయాల నుంచి ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లను అలంకరించుకొని డీజే శబ్దాలతో రైతువేదికల వరకు ర్యాలీగా వెళ్లనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. వ్యవసాయంలో రాణిస్తున్న ముగ్గురు చొప్పున కర్షకులను రైతువేదికల్లో సన్మానిస్తారు. వారితో విజయగాథలు చెప్పిస్తారు. వేడుకలకు హాజరైన రైతులకు అధికారులు భోజనం సమకూరుస్తారు.

# విక్రయానికి సిద్ధంగా ప్రభుత్వ భూమి..

భూపాలపల్లి : ప్రభుత్వమే లే అవుట్ చేసి ప్రజలకు స్థలాలను అమ్మడానికి కసరత్తు ప్రారంభించింది. క్రయవిక్రయాలకు వీల్లేని ప్రభుత్వ, అసైన్డ్ భూములను లే అవుట్ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. భూపాలపల్లి పురపాలక సంఘం పరిధిలోని భూములతో పాటు భూ యజమానులు ముందుకొస్తే ప్రైవేటు భూముల్లో లే అవుట్ చేసి బహిరంగ వేలం ద్వారా విక్రయించడానికి సమాయత్తమవుతున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. కాశీంపల్లి వద్ద 10 ఎకరాల ప్రభుత్వ భూమి, మరో 10ఎకరాల ప్రైవేట్ భూమిని గుర్తించారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం రానుంది.

**ప్రైవేట్ స్థలాల్లోనూ..**

ప్రభుత్వ, అసైన్డ్ భూములే కాకుండా ప్రైవేటు భూముల్లోనూ ప్రభుత్వ పరంగా లే ఆవుట్ చేసి, వాటిని విక్రయించి ఆదాయం సమకూర్చుకోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయినట్లు రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు తెలిపారు. ఏయే ప్రాంతంలో లే అవుట్ చేస్తే ఫలితాలు వస్తాయి, ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ, అసైన్డ్, ప్రైవేట్ భూముల లెక్కలను అధికారులు ఆరా తీస్తున్నారు. అసైన్డ్ భూములు ఎక్కువగా ఉన్న వేశాలపల్లి, జంగేడు, కాశీంపల్లి ప్రాంతాల్లో అధికారులు భూముల సేకరణపై దృష్టి పెట్టారు. ఆసక్తి కలిగిన రైతులు, భూ యజమానులు ముందుకు వస్తే వారి భూముల వివరాలను పరిశీలించి హైదరాబాద్‌లోని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు జిల్లా అధికారులు నివేదిస్తారు. అక్కడి నుంచి అనుమతులు వచ్చాకే ప్లాట్ల విక్రయాలు చేపడుతారు. భూములు లే అవుట్‌కు అప్పగిస్తే భూ యజమానులకు, రైతులకు చెల్లింపులు ఎలా



చేస్తారనే దానిపై పూర్తి మార్గదర్శకాలు తెలియాల్సి ఉంది.

**కనీసం 20 ఎకరాలు**

ప్లాట్లు చేయడానికి అనుకూలంగా ఉండాలంటే ఒకే చోట సుమారుగా 20 ఎకరాలు అవసరమని అధికారులు చెబుతున్నారు. రైతులు, భూ యజమనాలు ముందుకు వస్తే అనుమతులన్నీ అధికారులే చూసుకుంటారు. మురుగు కాల్వలు, రహదారులు, ప్రజా అవసరాల రీత్యా ఉద్యానవనం, ప్రార్థన మందిరాలకు పది శాతం స్థలం వదలడం, విద్యుత్తు సౌకర్యం, తాగునీటి వసతి వంటి తదితర మౌలిక వసతులు ప్రభుత్వమే కల్పిస్తుంది. మొత్తం స్థలంలోనే 40 శాతం మురుగు కాల్వలు, రోడ్ల నిర్మాణాలకే సరిపోతుందని అధికారులు చెబుతున్నారు. మిగితా 60 శాతం స్థలంలో ఏర్పాటైయ్యే ప్లాట్లలో సగం భూమి యజమానికి అప్పగిస్తుంది. మిగితా సగం ప్లాట్లు ప్రభుత్వం వేలం పాటల్లో విక్రయిస్తుంది. భూమి రకాన్ని బట్టి ఒకవేళ ప్లాట్ల ఏర్పాటుకు అధికంగా ఖర్చయితే యజమానికి 40 శాతం, ప్రభుత్వానికి 60 శాతం ప్లాట్లు కేటాయించాల్సి ఉంటుంది. అసైన్డ్, ప్రైవేటు భూముల్లో లే అవుట్ చేయాలంటే సదరు రైతులు సమ్మతిస్తేనే అధికారులు ఈ ప్రక్రియ మొదలు పెడతారు. ఈ విషయమై భూపాలపల్లి తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్‌ను వివరణ కోరగా ప్లాట్లు చేసి విక్రయించాలనే ఆదేశాలు కొద్ది రోజుల క్రితమే ప్రభుత్వం నుంచి వచ్చాయని స్పష్టం చేశారు. ఇప్పటికే నాలుగు సర్వే నెంబర్లలో 20 ఎకరాల వరకు భూములను ప్రాథమికంగా గుర్తించినట్లు పేర్కొన్నారు.

# యోగా శిక్షణ.. తప్పని నిరీక్షణ

ఇబ్రహీంపట్నం : ప్రస్తుత ఉరుకుల, పరుగుల జీవితంలో చాలా మంది శారీరక శ్రమకు దూరమవుతున్నారు. పని ఒత్తిడితో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దీంతో మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలకు అనుబంధంగా జాతీయ ఆయుష్ మిషన్ ద్వారా యోగా(ఆరోగ్య స్వస్థత) కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటిలో రోగులకు యోగా శిక్షణ ఇవ్వనుంది.

**మొదటి విడతలో 12..**

జిల్లాలో 18 మండలాలు ఉండగా మొదటి విడతలో 12 యోగా కేంద్రాల నిర్మాణానికి నిధులను గతేడాది మంజూరు చేసింది. ఒక్కో కేంద్రానికి రూ.6 లక్షల చొప్పున మొత్తం రూ.72 లక్షలను కేటాయించారు. జిల్లాలో వివిరావుపేట్, వెల్లుల్ల, బండలింగపూర్, ఎండపల్లి, కొడిమ్యాల, మేడిపల్లి, అయిలాపూర్, బతికేపల్లి, ధర్మపురి, లక్ష్మిపూర్, చిల్వాకోడూర్, అల్లీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల ఆవరణలో వీటిని నిర్మిస్తున్నారు. వీటిలో చిల్వాకోడూర్, అల్లిపూర్‌లో నిర్మాణ పనులు జరుగుతుండగా, మిగిలిన వాటిలో నిర్మాణాలు పూర్తయ్యాయి.

**ఒక్కో కేంద్రానికి ఇద్దరు శిక్షకులు**

ఒక్కో యోగా కేంద్రంలో ఇద్దరు శిక్షకులను నియమించనున్నారు. ఆడవారికి శిక్షణ ఇవ్వడానికి ఆడ, మగ వారికి శిక్షణ ఇవ్వడానికి మగ శిక్షకుడు ఉంటారు. ఆడ, మగ వారికి ఒకే సమయంలో కాకుండా వేర్వేరు సమయాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. పలు చోట్ల కొన్ని నెలల క్రితమే నిర్మాణాలు పూర్తికావడంతో వృథాగా ఉంటున్నాయి. శిక్షకులను నియమిస్తే యోగా కేంద్రాలు అందుబాటులోకి వచ్చి, ప్రజలకు, గర్భిణులు, దీర్ఘకాలిక రోగులకు మేలు జరగనున్నాయి.

**సొంత భవనాలు లేక వేరే చోట..**

బండలింగాపూర్, వెల్లుల్ల, ఎండపల్లి, కోరుట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడం, ఇతర కారణాలతో వాటికి మంజూరైన యోగా కేంద్రాలను వేరే చోట నిర్మించారు. బండలింగాపూర్‌కు మంజూరైన యోగా కేంద్రం ఇబ్రహీంపట్నంలో, వెల్లుల్ల యోగా కేంద్రం జగ్గాసాగర్‌లో, ఎండపల్లి యోగా కేంద్రం అంబరిపేట్‌లో, కోరుట్ల యోగా కేంద్రం అయిలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆవరణలో నిర్మించారు.

**నియామకం పూర్తయితే..– శ్రీనివాస్, జిల్లా వైద్య మరియు ఆరోగ్య ఉప వైద్యాధికారి**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆవరణలో ఏర్పాటు చేసిన యోగా కేంద్రాల్లో రక్తపోటు, మధుమేహ, థైరాయిడ్ వంటి వాటితో బాధపడుతున్న దీర్ఘాకాలిక రోగులతో పాటు గర్భిణులు, ప్రజలకు యోగా శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షకుల నియామకం పూర్తయిన తర్వాత శిక్షణ ప్రారంభం కానుంది.

# పచ్చి బియ్యం సేకరణకు సిద్ధం

జయశంకర్ :రెండు నెలల పీటముడి తర్వాత మిల్లర్ల నుంచి పచ్చి బియ్యం (రా రైస్) సేకరణకు భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) సిద్ధమైంది. 20న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ బియ్యం సేకరించాలని ఆదేశాలు జారీ చేయడంతో కాజీపేట ఎఫ్‌సీఐలో అందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. బియ్యం పంపించాలని ఉమ్మడి జిల్లాలోని అన్ని రైస్‌మిల్లుల యజమానులకు అధికారులు సమాచారం పంపారు. ప్రధానమంత్రి అన్న యోజన పథకం కింద పేదలకు రెండు నెలలుగా అయిదు కిలోల బియ్యం అందకపోవడంతో అది అందించాకే మిల్లర్ల నుంచి బియ్యం సేకరిస్తామని కేంద్రం చెప్పింది. గత రెండు నెలలుగా పౌరసరఫరాల శాఖ అయిదు కిలోల బియ్యం పంపిణీ పూర్తి చేసింది.

చాలినంత స్థలం: బియ్యం సేకరణకు కాజీపేట ఎఫ్‌సీఐలో చాలినంత



స్థలం ఉంది. గోదాముల సామర్థ్యం 92 వేల మెట్రిక్‌టన్నులకు గాను 71 వేల మెట్రిక్‌టన్నుల ఖాళీ స్థలం అందుబాటులో ఉంది. ఇంకా నెక్కొండ, రఘునాథపల్లి, యశ్వంతాపురం, నిడిగొండలోనూ ప్రైవేటు గోదాములున్నా అక్కడ బియ్యం నిల్వలు ఉన్నాయి. నెక్కొండలో 30వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం మేర ఖాళీ స్థలం ఉంది. 2021-22 సంవత్సరంలో వానాకాలం పంట ధాన్యాన్ని ప్రస్తుతం సేకరించనున్నారు. 2020-21 సీజన్ నుంచి కస్టమ్ మిల్లింగ్ ద్వారా ఇప్పటికీ 35,000 మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్ (సీఎంఆర్) బియ్యం ప్రభుత్వానికి రావాల్సి ఉంది. ఈ బియ్యం సేకరణకు కేంద్ర ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

నాణ్యత లేకపోతే తిరస్కరిస్తాం- నీరజ్‌కుమార్, ఎఫ్‌సీఐ డీఎం

రెండు నెలల తర్వాత ప్రారంభమవుతున్న బియ్యం సేకరణకు పెద్ద ఎత్తున లారీలు ఎఫ్‌సీఐకి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నాం. గ్రామాలకు హమాలీలను తిరిగి రప్పించాం. మిల్లర్లు ప్రభుత్వం ఇచ్చిన నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ బియ్యం అందించి సహకరించాలి. నాణ్యత లేకపోతే తిరస్కరిస్తాం.

# అంచనాలు సరే.. నిధులేవి..?

మహబూబాబాద్ : నదీ పరివాహక ప్రాంతాలకు రెండు వైపులా ఉన్న సన్న, చిన్నకారు రైతులకు సాగునీటి వసతి కల్పించేందుకు దశాబ్దాల కిందట నిర్మించిన ఎత్తిపోతల పథకాల మరమ్మతు, పునరుద్ధరణ పనులు ఉత్తి మాటలు గానే నిలిచిపోతున్నాయి. జిల్లాలో ప్రవహిస్తున్న మున్నేరు, ఆకేరు, పాకాల వాగులపై సుమారు మూడు దశాబ్దాల కిందట ఎత్తిపోతల పథకాలను నెలకొల్పారు. ఒక్కో పథకంలో వంద నుంచి 800 ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన పథకాల్లో కొన్ని విద్యుత్తు మోటార్లు పనిచేయకపోవడంతో మూలనపడేశారు. మోటార్లను వినియోగించకపోవడంతో పరికరాలు తుప్పుపట్టిపోయాయి. జిల్లాలో 18 ఎత్తిపోతల పథకాలుండగా పది పని చేస్తున్నాయి. మరమ్మతు కోసం అంచనాలను ప్రభుత్వానికి ప్రతిపాదించినా నిధులు మంజూరు కాకపోవడంతో రైతులు సొంతంగా వ్యవసాయ బావులు, తవ్వుకున్నారు. మరికొందరు వాగులపైనే విద్యుత్తు మోటార్లు ఏర్పాటు చేసుకొని సాగునీటి సౌకర్యం కల్పించుకున్నారు. ఈ పథకాలను పునరుద్ధరిస్తే సుమారు ఐదారు వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నిరుపయోగంగా విద్యుత్తు నియంత్రిక

కురవి: ఈ చిత్రంలో కనిపిస్తున్న విద్యుత్తు నియంత్రిక కురవి మండలం లక్ష్మీనారాయణపురం (కొత్తూరు జి) గ్రామ సమీపం నుంచి ప్రవహించే మున్నేరువాగు పక్కన ఉంది. 1982లో నాలుగు వందల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించేందుకు ఐడీసీ పథకం ద్వారా ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేశారు. దశాబ్దకాలం పాటు రైతులకు సాగునీటిని అందించారు. ఆ తర్వాత నిర్వహణ లోపంతో మూలన పడింది. 2005లో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని పునరుద్ధరించి ఆరేళ్ల సాగునీటి సౌకర్యం కల్పించింది. అనంతరం విద్యుత్తు మోటార్లు చెడిపోవడం, కాలువల పునరుద్ధరణ లేక సుమారు పదేళ్ల నుంచి ఈ పథకం పని చేయడం లేదు. దీంతో విద్యుత్తు మోటార్లు తుప్పుపట్టాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రిక నిరుపయోగంగా మారింది. మరమ్మతుకు ఇటీవల 12.35 లక్షలు అంచనాతో ప్రతిపాదనలు పంపించారు.

మూలనపడిన మోటార్లు

గార్ల మండలం పాకాలవాగుపై అంజనాపురం వద్ద నిర్మించిన ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్తు మోటార్లు కాలిపోయాయి. సుమారు నాలుగు వందల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి వసతి కలిగిన ఎత్తిపోతల పథకం పని చేయక మోటార్లు మూలన పడేశారు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. పథకం పునరుద్ధరణ కోసం గతంలో టెండర్లు ఆహ్వానించి అర్ధాంతరంగా ద్దు చేసి నిధులను మళ్లించారు.

పని చేయనివి మరికొన్ని..మహబూబాబాద్ మండలంలోని గాంధీపురం ఎత్తిపోతల పథకం కింద 325 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ పథకం పునరుద్ధరణ కోసం రూ. 16.170 లక్షల నిధుల మంజూరుకు అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపించారు. గార్ల మండలంలోని పాకాల వాగుపై బుద్దారం, రాంపూరం ఎత్తిపోతల పథకాలు పని చేయడం లేదు. వాటి మరమ్మతులకు ఎలాంటి ప్రతిపాదనలు లేవు. డోర్నకల్ మండలంలోని అందనాలపాడు ఎత్తిపోతల పథకం పునరుద్ధరణకు రూ. 2.83 కోట్ల అంచనాలు పంపించారు.

ప్రతిపాదనలు పంపించాం- వెంకటేశ్వరరావు, ఈఈ, నీటిపారుదల శాఖమహబూబాబాద్, గూడూరు మండలాల్లో ఉన్న నాలుగు ఎత్తిపోతల పథకాల్లో రెడ్యాల, అయోధ్యపురం ఎత్తిపోతలు పని చేస్తున్నాయి. పనిచేయని గాంధీపురం పథకానికి మరమ్మతుల కోసం అంచనాలు వేసి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించాం. బొల్లెపల్లి పథకానికి నిధులు మంజూరు కాగా పనులు కొనసాగుతున్నాయి.

# గ్రామీణుల ముంగిట 'ఆరోగ్య సిరి'



జయశంకర్ : నర్సంపేటలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టడంతో పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చింది. పేద, మధ్య తరగతి ప్రజలు ఈ పథకంలో వైద్య సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు వరంగల్, హైదరాబాద్ నగరాల్లోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో, జిల్లా ప్రభుత్వ ప్రధాన దవాఖానాల్లో ఆరోగ్యశ్రీ కింద వైద్య సేవలందేవి. అంతదూరం వెళ్లి వైద్యం చేయించుకునేందుకు సామాన్య ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నర్సంపేట, వర్ధన్నపేట, పరకాల, కమలాపురంలోని సీహెచ్‌సీ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద వైద్యసేవలందిస్తున్నారు. ఇదే క్రమంలో నర్సంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీలో ఆరు విభాగాలకు చెందిన వైద్యసేవలు, చికిత్సలకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఆసుపత్రికి సీమాంక్ కేంద్రం, డయాలసిస్ కేంద్రం, సాధారణ ప్రసూతి భవనం, శస్త్రచికిత్స కేంద్రం, రక్తనిధి కేంద్రం ఏర్పాటు చేశారు. నిత్యం 300-400 వరకు ఓపీ ఉంటుందని, అదే సీజన్‌లో అయితే 500 మంది ఓపీ ఉంటుందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం 80 పడకలు అందుబాటులో ఉన్నాయి. ఐసీయూ విభాగంతో పాటు ఆక్సిజన్ ఏర్పాటు చేశారు.

ఈ విభాగాలకు ఆరోగ్యశ్రీ సేవలు

సీహెచ్‌సీలో జనరల్ సర్జరీ, గైనకాలజీ, అబ్‌స్ట్రెట్రిక్ సర్జరీ, నెఫ్రాలజీ, ఆర్థోపెడిక్ సర్జరీ, ప్రొసీడ్యూర్స్, పిడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్ తదితర విభాగాల్లో ఆరోగ్యశ్రీలో వైద్యం, చికిత్సలు అందిస్తున్నారు. డయాలసిస్ విభాగం ఉండడంతో నెఫ్రాలజీకి(డయాలసిస్‌కు )సంబంధించిన రోగులకు మెరుగైన వైద్యం అందుతోంది. తక్కువ బరువుతో పుట్టిన నవజాత శిశువులు, కామెర్లు సోకిన పిల్లలకు ఫొటో థెరఫి, వార్మర్స్‌లో పెట్టి చికిత్స అందిస్తున్నారు. జాతీయరహదారి ఉన్నందున ఈప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. ఇంతకుముందు ప్రథమచికిత్స చేసి వరంగల్‌కు పంపించేవారు. ప్రస్తుతం కాళ్లు, చేతులు విరిగితే సిమెంటు పట్టితో కట్టుకట్టడంతో పాటు కొన్ని రకాల చికిత్సలను ఇక్కడే చేస్తున్నారు. గైనకాలజీ విభాగంలో కొన్నింటికి ఆరోగ్యశ్రీలో వైద్యం చేస్తున్నారు.

ఆసుపత్రి అభివృద్ధికి నిధుల వినియోగం

ఆరోగ్యశ్రీలో వైద్యంతో వచ్చే నిధుల్లో 30 శాతం ఆసుపత్రి అభివృద్ధికి మిగతా మొత్తాన్ని వైద్యం చేసిన వైద్యులకు, సిబ్బందికి, ఇతర ఖర్చులకు చెల్లిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీలో జమ అయిన నిధులను డీజిల్‌కు వినియోగిస్తున్నట్లు సమాచారం. మున్ముందు వైద్య పరికరాలు, ఇతర అవసరాలకు ఖర్చు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ఆపరేషన్ థియేటర్ అవసరం

నర్సంపేట పట్టణం అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లోని అటవీ గ్రామాలు, గిరిజన తండాల ప్రజలు పలు అవసరాల కోసం నిత్యం ఇక్కడికే వస్తారు. జాతీయ రహదారి నిర్మించిన తరువాత రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగింది. ఎముకల విభాగం(ఆర్థో) కేసులు ఎక్కువగా ఉంటున్నాయని వైద్య సిబ్బంది తెలిపారు. ఎముకల విభాగానికి సంబంధించి ఆపరేషన్ థియేటర్, సీ ఆమ్ యంత్రం వంటివి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మెరుగైన సేవలందిస్తాం- డాక్టర్ గోపాల్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్, నర్సంపేట

ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆరోగ్యశ్రీలో ప్రస్తుతం ఆరు విభాగాల్లో రోగులకు వైద్యం అందిస్తున్నాం. రానున్న రోజుల్లో మరిన్ని విభాగాల్లో మెరుగైన సేవలందించేందుకు ప్రయత్నిస్తాం.

# కరకట్ట నిర్మాణంతోనే తీరానికి రక్షణ

జయశంకర్ : అధిక వర్షాలు.. గోదావరి ఉగ్రరూపం.. వెరశి తీర ప్రాంతాల్లో అపార నష్టం.. గోదారమ్మను నమ్ముకుని జీవిస్తున్న వారే ముంపుపాలై అవస్థలు పడుతున్నారు. వరద ఉద్ధృతికి తీర ప్రాంతాల సాగుభూములు కోతకు గురవుతున్నాయి. ఇటీవలి భారీ వర్షాలకు ఏకంగా ఊళ్లకు ఊళ్లే ముంపునకు గురయ్యాయి. దీంతో వందల కుటుంబాలు నిరాశ్రయులయ్యారు. మున్ముందు కూడా ఇలాంటి ప్రమాదాలు పొంచి ఉన్నాయి. గోదావరి కోతకు నివారణ కరకట్టల నిర్మాణం. ఏళ్లుగా తీర ప్రాంతాల్లో కరకట్టల నిర్మాణాల కల నెరవేరడం లేదు. పాత కరకట్టలు కూడా మరమ్మతులకు గురయ్యాయి. దీంతో తీర ప్రాంతాల వారు ఆందోళన చెందుతున్నారు.

తీరాన భయాందోళన బతుకులు

గోదావరి తీరాన జీవనం భయాందోళనకు గురిచేస్తుంది. 2020లో వచ్చిన వరదలతో ఏటూర్‌నాగారం పట్టణంలోని పలుప్రాంతాలు నీట మునిగాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఏటూర్‌నాగారంలోని ఓడవాడ, ఎస్సీకాలనీ, రామప్పగూడెం, తదితర ప్రాంతాలు నీటమునిగాయి. మంగపేట మండలంలోని పొద్మూర్‌లో అదేపరిస్థితి. పుష్కరఘాట్ రోడ్డు గోదావరిలో కొట్టుకుపోయింది. గ్రామానికి మరింత చేరువగా కోతకు గురవుతూ వస్తోంది. అలాగే వాజేడు, వెంకటాపురం, మంగపేట పలిమెల, కాటారం, మహదేవ్‌పూర్ మండలాల్లో తీర ప్రాంతాల గ్రామాలు తీవ్రంగా నష్టపోయాయి. కట్టుబట్టలే మిగిలాయి. ఇలాంటి తరుణంలో తీరం గ్రామాలు భయాందోళనకు గురవుతున్నారు.

రైతన్నకు గుండెకోత

గోదావరి తీరాన ఉన్న రైతులు కూడా తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఏటేటా పొలానికి కోతపడుతోంది. గోదావరి పంట భూముల్ని మింగుతోంది. ముంపుతో నష్టం వాటిల్లుతోంది. కోతతో భూమి కుచించుకుపోతోంది. అలాగే గోదావరిలో కలిసే వాగులు కమ్మేయడంతో కూడా వాగుల పరివాహక ప్రాంతాల భూములు కూడా కోతకు గురవుతున్నాయి.

ముందుకు కదలని కరకట్టల నిర్మాణాలు..గోదావరి తీర ప్రాంతాల్లో ముంపును గుర్తించిన ప్రభుత్వాలు తీర ప్రాంతాల్లో కరకట్టల నిర్మాణాలకు నిర్ణయించింది. మొదటి దశలో 2003 ఏటూర్‌నాగారం, రామన్నగూడెం వరకు 10 కిలోమీటర్ల మేర కరకట్టల నిర్మాణం జరిగింది. అయితే అప్పుడు రూ.75 కోట్లు మంజూరు కాగా, రూ.35 కోట్లు ఖర్చు చేశారు. తర్వాత రూ.40 కోట్లతో ఏటూర్‌నాగారం మండలం రామ్‌నగర్, మంగపేట మండలం కమలాపూర్, మంగపేట మల్లారం, కన్నాయిగూడెం మండలం కన్నాయిగూడెం, గంగారం, ఐలాపురం, ప్రాంతాల్లో నిర్మాణం చేయాల్సి ఉన్నా భూసేకరణ, కొన్ని అభ్యంతరాలతో పనులు ఆగిపోయాయి. తర్వాత మూడేళ్ల క్రితం రెండో దశలో రూ.137 కోట్లు మంజూరయ్యాయి. కాని పనులు పట్టాలెక్కలేదు.

సీఎం కెసిఆర్ శాశ్వత పరిష్కార మార్గంతో ఆశలు..ఇటీవల సీఎం కేసీఆర్ ఏటూర్‌నాగారం పర్యటనలో ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కార మార్గం చూపెడతామని హామి ఇచ్చారు. దీంతో తీరప్రాంత వాసుల్లో ఆశలు చిగురించాయి. రూ.137 కోట్లతో నిర్మించాల్సి ఉన్న కరకట్టల నిర్మాణాన్ని కూడా ఆపేయాలని ఆదేశించారు. ఉన్నత విద్యా సంస్థల ఆధ్వర్యంలో పరిశోధనలు చేసి వాటికి పరిష్కారం చూపెడతామని చెప్పినట్లు సమాచారం.

ప్రమాదం పొంచి ఉన్న గ్రామాలు

కాటారం మండలం: విలాసాగర్, దామెరకుంట, గంగాపురి, గుండ్రాత్‌పల్లి, లక్ష్మీపురంమహదేవ్‌పూర్ మండలం: అన్నారం, మద్దులపల్లి, చంద్రుపల్లి, కాళేశ్వరం, కన్నెపల్లి, బీరసాగర్,



మహదేవ్‌పూర్, అంబట్‌పల్లి, పెద్దంపేటపలిమెల మండలం: లెంకలగడ్డ, పంకెన, పలిమెల, సర్వాయిపేట, దమ్మూరు, నీలంపల్లి

ములుగు జిల్లాకన్నాయిగూడెం మండలం: కంతనపల్లి, లక్ష్మీపురం, రాజన్నపేట, కన్నాయిగూడెం, వెంకట్రావుపల్లి, ఏటూరు

టూరునాగారం మండలం: ఏటూర్‌నాగారం, రామన్నగూడెం, రాంనగర్, లంబాడితండా, పప్కాపూర్, కోయగూడ, ఎల్లాపూర్

మంగపేట మండలం: కమలాపూర్, గంపోనిగూడెం, మంగపేట, పొదుమూరు, బోరునర్సాపురం, చంచుపల్లి, పాలాయిగూడెం, మల్లారం, వాడగూడెం, కత్తిగూడెం

వెంకటాపురం మండలం: ఎదిర, సూరవీడుకాలనీ, సూరవీడు, బోధాపురం, పాలెం, అబ్బాయిగూడెం, టేకులబోరు, లక్ష్మీపురం, వెంగళరావుపేట, గొల్లగూడెం, వెంకటాపురం పట్టణంలోని చర్చిపేట, నాయకులగూడెం.

వాజేడు మండలం: టేకులగూడెం, పెదగంగారం, చంద్రుపట్ల, చింతూరు, నాగారం, పేరూరు, వాజేడు, ఎడ్జర్లపల్లి, పూసూరు, పెదగొల్లగూడెం,పడిగాపురం, అయ్యవారిపేట

మరమ్మతులు అవసరం..ఏటూర్‌నాగారం, రామన్నగూడెం తీరప్రాంతాల్లో నిర్మించిన కరకట్ట దెబ్బతింది. మొన్నటి వర్షాలకు ఓడవాడ వద్ద కరకట్ట తెగిపోయే ప్రమాదం ఏర్పడింది. గమనించిన స్థానికులు ఇసుక బస్తాలు వేసి రక్షణ చర్యలు చేపట్టారు. లేదంటే ఆరోజు పెనుప్రమాదం జరిగేది.

కరకట్టలు నిర్మించాలి-పూసాల కనకం, రైతు, బోరునర్సాపురం, మంగపేట

కరకట్టలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. ఏటా భూములు కోతకు గురవుతున్నాయి. వర్షాకాలంలో వరద ముంచుతోంది. పంటలు నష్టపోతున్నాం. కరకట్టలు నిర్మించి ఆదుకోవాలి.

ఏటా పంటలు మునుగుతున్నాయి-మాటూరి రమేశ్, రైతు, మద్దులపల్లి, మహదేవ్‌పూర్

అన్నారం బ్యారేజీ నుంచి నీరు విడుదల చేసినప్పుడు భారీగా వరద పంటపొలాల్లోకి వస్తోంది. దీంతో పంటలు నష్టపోతున్నాం. కరకట్టలు నిర్మించి వరద రాకుండా చూడాలి. ఇటీవల వరదలకు ఇళ్లలోకి నీరు రావడంతో మరింత నష్టం వాటిల్లింది.

# ఆయుష్ సేవలు.. అంతంతే!

ఇల్లెందు : ఉమ్మడి జిల్లాలో ఆయుష్(ఆయుర్వేద, హోమియో, యునాని) వైద్యశాలలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తుండటంతో ఏళ్ల తరబడి వైద్యులు, ఫార్మసిస్టుల నియామకాలు లేకుండా పోయాయి. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో వైద్యశాలలు పేరుకే అన్నట్టు ఉంటూ కొనసాగుతున్నాయి. వైద్యుడు ఉన్నచోట సిబ్బంది ఉండటం లేదు. సిబ్బంది ఉన్నచోట వైద్యులు లేరు. కొన్నిచోట్ల కేవలం సిబ్బందితో నడిచే కేంద్రాలున్నాయంటే అతిశయోక్తికాదు. నిబంధన ప్రకారం హోమియో, యునాని, ఆయుర్వేద వైద్యశాలల్లో వైద్యులు, ఫార్మసిస్టులు, స్వీపర్ కమ్ స్కావెంజర్ ఉండాలి. కానీ కాగితాల మీదనే ఆ నిబంధనలు కొనసాగుతున్నాయి.

ఆయుర్వేద వైద్యశాలలు

ఖమ్మం, తల్లంపాడు (ఖమ్మం గ్రామీణం), కొణిజర్ల, బోనకల్లు, గొల్లపూడి (వైరా), మధిర, భద్రాచలం, అర్లగూడెం, ఆర్.కొత్తగూడెం, చుంచుపల్లి, రొంపేడు (ఇల్లెందు), నాగుపల్లి (దమ్మపేట), అశ్వాపురం, కరకగూడెం, ఏన్కూరు.

సిబ్బంది కొరత ఇలా.. 10 వైద్యశాలల్లో వైద్యులు, 18 వైద్యశాలల్లో



ఫార్మసిస్టులు, 14 వైద్యశాలల్లో స్వీపర్ కమ్ స్కావెంజర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కూసుమంచి, కాకరవాయి, ఈర్లపూడి, మామునూరు, చిన్నకోరుకొండిలో వైద్యులు లేరు. ఈర్లపూడి, మామునూరు, చిన్నకోరుకొండి, నేలకొండపల్లి, గొల్లపూడి, పెనుబల్లి, కొణిజర్లలో ఫార్మసిస్టులు లేరు. వైద్యులు లేనిచోట ఫార్మసిస్టులే రోగుల్ని పరీక్షించి మందులు ఇస్తున్నారు.

ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో ఐదేళ్ల నుంచి హోమియో వైద్యశాల పని చేయడం లేదు. ఉన్న ఒక్క ఉద్యోగి ఇటీవల బదిలీపై వెళ్లారు. రొంపేడులోని ఆయుర్వేద వైద్యశాల ఫార్మసిస్టుతోనే కొనసాగుతోంది. వైద్యం కోసం ఇక్కడకు మిట్టపల్లి, పూసపెల్లి, మామిడిగూడెం, కొమరారం, పోలారం, రొంపేడు తదితర ప్రాంతాల వారు వస్తుంటారు. వారికి ఇబ్బందికరంగా మారింది.

హోమియోఖమ్మం, ఈర్లపూడి (రఘునాథపాలెం), ముదిగొండ, నేలకొండపల్లి, కూసుమంచి, కాకరవాయి (తిరుమలాయపాలెం), తల్లాడ, భద్రాచలం, ఇల్లెందు, అశ్వారావుపేట, చిన్నకోరుకొండి (కల్లూరు), పెనుబల్లి యునాని సత్తుపల్లి, ఖమ్మం, భద్రాచలం, జూలూరుపాడు (పాపకొల్లు).

# నీరుందని... తోడేయకు

ఇల్లెందు : భూగర్భ జలం పుష్కలంగా ఉందని, కరెంటు ఉచితంగా వస్తోందని నిరంతరాయంగా తోడేస్తే భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుంది. గతంలో వ్యవసాయానికి కొద్ది గంటలు మాత్రమే విద్యుత్తును సరఫరా చేసేవారు. ప్రస్తుతం నిరంతరం సరఫరా అందిస్తున్నారు. ఇది రైతులకు ఎంతో ఉపకరిస్తున్నా.. అదే సమయంలో అవసరం ఉన్నా లేకున్నా నీటిని తోడేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం విద్యుత్తు మోటార్లకు అమర్చిన ఆటోమేటిక్ స్టార్టర్లేనని ఆ శాఖ గుర్తించింది. దీనివల్ల ఓ వైపు విద్యుత్తు వినియోగం పెరుగుతూ మరోవైపు భూగర్భ జలం తరిగిపోతుంది. ఈ నేపథ్యంలో విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులు ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగించాలని నిర్ణయించారు.

జలం, విద్యుత్తు వృథా

వ్యవసాయ మోటార్ల ద్వారా ఎక్కువగా మెట్ట పంటలతో పాటు, వరిని ప్రధానంగా సాగుచేస్తున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో అధికంగా వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి ఏడాది ఈ సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గతంలో వ్యవసాయానికి పగలు, రాత్రి ఏడు గంటలు మాత్రమే విద్యుత్తు సరఫరా చేసేవారు. అంతేగాకుండా ఎప్పుడు సరఫరా ఉంటుందో తెలియక ఎక్కువ మంది రైతులు మోటార్లకు ఆటోమేటిక్ స్టార్టర్లను ఏర్పాటుచేశారు. విద్యుత్తు వచ్చినపుడు దానికంతటదే మోటారు రన్నింగ్ అయి పంటలకు నీరు సరఫరా అవుతుంది. ప్రస్తుతం విద్యుత్తును పగటి సమయంలోనే అందించడంతో గతంలో ఉన్న కష్టాలు లేవు. అయినప్పటికీ ఆటోమేటిక్ స్టార్టర్లను తీయకుండా పాత విధంగానే మోటార్లను నిర్వహిస్తున్నారు. దీంతో సాగునీటి అవసరతతో పనిలేకుండా నిరంతరాయంగా మోటారు నడవడం వల్ల నీరంతా వృథాగా పోతోంది.

తొలగింపు పనుల్లో సిబ్బంది

వానకాలం వ్యవసాయ పనులు ముమ్మరమైన నేపథ్యంలో విద్యుత్తు దుర్వినియోగం అరికట్టేందుకు ఆ శాఖ ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగించాలని నిర్ణయించింది. దీంతో మండలాల్లో సిబ్బంది వ్యవసాయ మోటార్ల దగ్గరకు వెళ్లి స్టార్టర్లను తొలగిస్తున్నారు. మళ్లీ ఎవరైనా రైతులు వాటిని వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకోవడానికి పటిష్టమైన చర్యలు చేపట్టింది. ఖమ్మం జిల్లాలో ఏన్కూరు, కొణిజర్ల, తల్లాడ, చింతకాని, నేలకొండపల్లి, ముదిగొండ, కూసుమంచి, రఘునాథపాలెం, తిరుమలాయపాలెం, కల్లూరు, బోనకల్లు మండలాల్లో, భద్రాద్రి జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, సుజాతనగర్, జూలూరుపాడు, బూర్గంపాడు మండలాల్లో అధికంగా వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి.

నివారణోపాయంరైతులు అవసరం ఉన్న సమయంలో మోటారు వేసుకుని పంటలకు తడులు ఇవ్వడం వల్ల నీటితోపాటు విద్యుత్తు వృథాను అరికట్టవచ్చు. అవసరం మేరకే నీటి వినియోగంపై రైతులకు అధికారులకు అవగాహన కల్పించి ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగించేందుకు పురమాయించాలి.

ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ కనెక్షన్లు

ఖమ్మం: 1,02,760భద్రాద్రి: 41,900

ఆటోమేటిక్ స్టార్టర్లతో అనర్థాలివీ.. అవసరం లేకపోయినా మోటార్ నడిచి విద్యుత్తు దుర్వినియోగం అవుతుంది.అనవసరంగా నీటిని తోడివేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు.నిరంతరాయంగా మోటార్లు నడవడం వల్ల అవి కాలిపోతాయి. ఒకేసారి మోటార్లన్నీ ఆన్ కావడంతో నియంత్రికలపై భారం పడి అవికూడా కాలిపోతాయి. విద్యుత్తు అనుచిత వాడకం వల్ల ప్రభుత్వంపై భారం పడుతుంది.వ్యవసాయ మోటార్లకు ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగిస్తున్నాం. వాటి వల్ల విద్యుత్తు ఎక్కువగా దుర్వినియోగం అవుతుంది. రైతులు అవగాహన కలిగి వాటిని తొలగించి సహకరించాలి. మళ్లీ వాటిని అమర్చవద్దు.




## విపత్తు వేళ మానవత్వం.. రక్తదానానికి కదిలొచ్చిన యువకులు

బాలాసోర్: ఒడిశాలోని బాలేశ్వర్ జిల్లాలో మూడు రైళ్లు ఢీ కొన్న ఘటన వందలాది కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపింది. ఈ విపత్కర పరిస్థితుల్లో కొందరు స్థానికులు మానవత్వాన్ని చాటుకున్నారు. గాయపడిన వారికి రక్తం అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. బాలేశ్వర్ సమీపంలోని బహానగా బజార్ వద్ద జరిగిన ఈ దుర్ఘటనలో 238 మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 900 మందికి పైనే గాయపడ్డారు. క్షతగాత్రులను బాలేశ్వర్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు పలు సమీప ఆసుపత్రులకు తరలించారు. అయితే ఈ పరిస్థితుల్లో గాయపడిన వారికి రక్తం అవసరం ఉంటుందని ఆలోచించిన వందలాదిమంది యువకులు నిన్న రాత్రే బాలేశ్వర్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. వీరంతా ఏ పిలుపూ లేకుండానే స్వచ్ఛందంగా ముందుకొచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. గంటల తరబడి వేచి ఉండి మరీ.. క్షతగాత్రులకు రక్తదానం చేస్తున్నారు.

**స్థానికుల సత్వర చర్యలు..** ప్రమాదం జరిగిన తర్వాత స్థానికులు చురుగ్గా స్పందించారు.

ఘటనాస్థలానికి వెళ్లి సహాయకచర్యలు చేపట్టారు. బోగీల్లో చిక్కుకున్న వారిని బయటకు తీశారు. "ప్రమాదం గురించి తెలియగానే మేం వెంటనే అక్కడకు బయల్దేరాం. దాదాపు 200-300 మందిని కాపాడగలిగాం" అని ఓ స్థానికుడు మీడియాతో అన్నారు.

**200 అంబులెన్స్‌లు..** ప్రమాద స్థలంలో భారత సైన్యం ముమ్మర సహాయకచర్యలు చేపట్టింది. బోగీల కింద చిక్కుకున్న వారిని బయటకు తీసి శరవేగంగా ఆసుపత్రులకు తరలించేందుకు 200 అంబులెన్స్‌లను ఘటనాస్థలంలో ఏర్పాటు చేశారు. ఇందులో 167 వరకు 108 వాహనాలు కాగా.. 20కి పైగా ప్రభుత్వ అంబులెన్స్‌లు ఉన్నాయి. వీటితో పాటు 45 మొబైల్ హెల్త్ బృందాలు ఘటనాస్థలంలో అందుబాటులో ఉన్నాయి. అదనంగా మరో 50 మంది వైద్యులను కూడా పంపించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఒడిశా రైలు ప్రమాదంపై ఏపీ సీఎం జగన్ ఉన్నతస్థాయి సమీక్ష

### ప్రమాదంపై జగన్ తీవ్ర దిగ్భ్రాంతి



అమరావతి: ఒడిశాలోని బాలాసోర్ సమీపంలో జరిగిన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో 233 మందికిపైగా చనిపోవడంపై విచారం తెలిపారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. మృతులు, క్షతగాత్రుల్లో రాష్ట్రానికి చెందిన వ్యక్తులు ఉన్నారా?.. లేదా? అన్న దానిపై దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు. రైల్వే అధికారులతో నిరంతరం టచ్‌లో ఉన్నామని సీఎంకు అధికారులు తెలిపారు. ఎలాంటి సహాయం కావాలన్నా అందించడానికి సిద్ధంగా ఉండాలని అధికారులకు జగన్ ఆదేశాలు జారీ చేశారు. రైల్వే అధికారుల నుంచి నిరంతరం సమాచారం తెప్పించుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సూచించారు. కాగా.. ఒడిశాలో శుక్రవారం రాత్రి ఘోర రైలు ప్రమాదం జరిగింది. పశ్చిమబెంగాల్‌లోని షాలిమార్ నుంచి చెన్నై సెంట్రల్ స్టేషన్‌కు ప్రయాణిస్తున్న కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ (12841) పట్టాలు తప్పి గూడ్స్ రైలును ఢీకొంది. దాదాపు 15 కోచ్‌లు పట్టాలు తప్పగా.. వాటిలో ఏడు తిరగబడిపోయినట్టు సమాచారం. వాటిలో కొన్ని పక్కనే ఉన్న మరో ట్రాక్‌పై పడ్డాయి. కొద్దిసేపటికి.. ఆ రెండో ట్రాక్ మీదుగా హౌరాకు వెళ్తున్న బెంగళూరు-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నంబర్ 12864) ట్రాక్‌పై పడి ఉన్న కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ కోచ్‌లను ఢీకొంది. ఆ తాకిడికి బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన నాలుగైదు బోగీలు పట్టాలు తప్పినట్టు సమాచారం.

తిరగబడిపోయిన బోగీల కింద వందల మంది చిక్కుకుపోయారు. ఆ బోగీల కింద నుంచి దాదాపు 70 మృతదేహాలను వెలికితీశారు. మృతుల సంఖ్య ఇప్పటికి 278కి చేరింది. ఈ ప్రమాదంలో 900 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల సంఖ్య ఇంకా పెరిగే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## రైలు ప్రమాద ఘటన గురించి తెలిసి చాలా బాధపడ్డాను

అమరావతి : ఒడిశా రైలు ప్రమాదంపై టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఒడిశాలోని బాలాసోర్‌లో జరిగిన ఘోర రైలు ప్రమాదంతో చాలా బాధపడ్డానని తెలిపారు. తమ ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు చంద్రబాబు హృదయపూర్వక సానుభూతి తెలియజేశారు. అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నానని చంద్రబాబు ట్విటర్ వేదికగా పేర్కొన్నారు. ఒడిశా రైలు ప్రమాదంలో మృతుల సంఖ్య 237కు చేరింది. రైలు ప్రమాదంలో మరో 900 మందికిపైగా తీవ్రగాయాలు అయ్యాయి. బాలాసోర్‌లో గూడ్స్ రైలును కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఢీకొన్న విషయం తెలిసిందే. దీంతో చెన్నై కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 13 బోగీలు పట్టాలు తప్పాయి. కోరమండల్ రైలు బోగీలపై యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ దూసుకెళ్లింది.



ఘటనలో యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ 4 బోగీలు పట్టాలు తప్పాయి. రైలు ప్రమాదంలో మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది.

## పేటలో ప్రవీణ్ హల్ చల్... అలర్ట్ అయిన పుల్లారావు!

ఎన్నికలు సమీపిస్తున్న వేళ తాజాగా చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలతో ఉమ్మడి గుంటూరు జిల్లా టీడీపీ నేతలు వణికిపోతున్నారనే కామెంట్లు వినిపిస్తున్నాయి. తాజా పరిణామాలు కూడా అందుకు బలం చేకూరుస్తున్నాయి! తాజాగా దివంగత కోడెల శివప్రసాద్ కుమారుడు శివరాం టిక్కెట్ విషయంలో చంద్రబాబు తీసుకున్న నిర్ణయంతో... కొత్తవారితో పోటీ ఉన్న కొంతమంది సీనియర్లు టెన్షన్ పడుతున్నారని తెలుస్తుంది. ఇందులో భాగంగా ప్రత్తిపాటి పుల్లారావు పేరు తాజాగా తెరపైకి వచ్చింది. సత్తెనపల్లి నియోజకవర్గంలో కోడెల శివరాం కు ఈ పరిస్థితుల్లో పోటీకి తట్టుకుని నిలబడి గెలిచే సత్తా ఉందా లేదా అనే విషయం కాసేపు పక్కనపెడితే... అతన్ని కన్విన్స్ చేసే విషయంలో బాబు లైట్ తీసుకున్నారని అంటున్నారు పరిశీలకులు. ఇది ప్రత్యర్థులకు ప్లస్ అయ్యే ఛాన్స్ లేకుండాపోదని హెచ్చరిస్తున్నారు. చిలకలూరిపేట వ్యవహారం తెరపైకి వచ్చింది. గతకొన్ని రోజులుగా గుంటూరు జిల్లా టీడీపీలో బాష్యం ప్రవీణ్ పేరు ఎక్కువగా వినిపిస్తుంది. అయితే ఈయన మొదట్లో పెదకూరపాడు టిక్కెట్ ఆశిస్తున్నారంటూ కథనాలొచ్చాయి. అయితే కన్నా రాకతో అక్కడి నుంచి తప్పించుకున్న ఆయన... కొమ్మలపాటి శ్రీధర్ ను కూడా దాటుకుని సీటు తెచ్చుకోవడం కష్టమని భావించినట్లున్నారనే కథనాలొచ్చాయి! అయితే తాజాగా ఆయన కన్ను చిలకలూరిపేటపై పడింది! వచ్చే ఎన్నికల్లో టీడీపీ టిక్కెట్ తెచ్చుకుని పేట నుంచి పోటీచేయాలని ఆయన ఫిక్సయ్యారంట. ఇందులో భాగంగా గత కొన్ని రోజులుగా నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు మొదలుపెట్టిన ప్రవీణ్... ఈమేరకు విందులు వినోదాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల మహానాడులో చంద్రబాబు వయసు 73 కావడంతో 73 లక్షల రూపాయల భారీ విరాళాన్ని అందజేశారు! ఇదే సమయంలో భాష్యం ఫౌండేషన్ పేరుమీద పేట ప్రాంతంలో



భారీగా సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. వీటిన్నింటితో చంద్రబాబు - లోకేష్ ల దృష్టి ప్రవీణ్ పై పడిందని తెలుస్తుంది. దీంతో చిలకలూరిపేటలో ఒక్కసారిగా అలర్ట్ అయ్యారు ప్రత్తిపాటి. 2019లో ఓడిపోయిన తర్వాత పుల్లారావు నియోజకవర్గంలో పెద్దగా కనబడిందిలేదు. హైదరాబాద్ లోనే వ్యాపారాలు చేసుకుంటున్నారు. అయితే తాజాగా ప్రవీణ్ పేరు ఒకటికి రెండు సార్లు వినిపించడం సోషల్ మీడియాలో కూడా ఫుల్ ఫాలోయింగ్ తో దూసుకుపోవడంతో అలర్ట్ అయిన పుల్లారావు తాజాగా ఈ వ్యవహారంపై స్పందించారు.. పబ్లిక్ గా ఓపెన్ అయ్యారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో టీడీపీ జెండాలతో ప్రవీణ్ అనుచరులు తిరుగుతున్న సమయంలో అలర్ట్ అయిన పుల్లారావు%శా% అసలు భాష్యం ప్రవీణ్ ఎవరు..? అతడికి చిలకలూరిపేటకు సంబంధం ఏమిటి..? ఆయనకు చిలకలూరిపేటలో ఓటుహక్కు అయినా ఉందా..? గెలిచినా ఓడినా ఆయన మళ్లీ పేటలో ప్రజలకు కనిపిస్తారా..? అంటూ వరుస ప్రశ్నలతో ఫైరయ్యారు. దీంతో పేటలో కొత్త పంచాయతీ మొదలైందనే కామెంట్లు వినిపిస్తున్నాయి. మరి ఈ రచ్చను బాబు ఎలా సైలంట్ చేస్తారనేది వేచి చూడాలి!




## ఒడిశా రైలు ప్రమాద దుర్ఘటన.. 278కి చేరిన మృతుల సంఖ్య

బాలేశ్వర్: ఒడిశా రాష్ట్రంలోని బాలేశ్వర్ జిల్లాలో రైలు పట్టాలపై సంభవించిన మృత్యుఘోషలో మృతుల సంఖ్య మరింత పెరిగింది. ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు 278 మంది దుర్మరణం చెందినట్లు అధికారులు వెల్లడించారు. వందల మంది గాయపడగా.. వారిని సమీపంలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికీ బోగీల కింద అనేక మంది చిక్కుకున్నట్లు తెలుస్తోంది. వారి కోసం ఎన్డీఆర్ఎఫ్, ఓడీఆర్ఎఫ్ ముమ్మరంగా గాలిస్తోంది. అటు భారత ఆర్మీ కూడా రంగంలోకి దిగింది. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మొత్తంగా 1200 మంది సిబ్బంది ఈ సహాయకచర్యల్లో పాల్గొన్నారు.

**ఒడిశాకు ప్రధాని మోదీ..** ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేడు సమీక్ష చేపట్టారు. రైల్వే శాఖ ఉన్నతస్థాయి అధికారులతో సమావేశమైన ఆయన.. పరిస్థితిపై ఆరా తీశారు.

మరోవైపు, ప్రధాని ఒడిశా రానున్నట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. తొలుత బాలాసోర్‌లో ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లి ప్రధాని పరిశీలించనున్నారు. అనంతరం కటక్‌లోని ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించనున్నట్లు తెలుస్తోంది.

**ప్రమాదం జరిగిందిలా..** స్థానిక అధికారుల కథనం ప్రకారం- బెంగళూరు నుంచి పశ్చిమ బెంగాల్‌లోని హావ్‌డాకు వెళ్తున్న బెంగళూరు-హావ్‌డా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ బాలేశ్వర్ సమీపంలోని బహానగా బజార్ వద్ద శుక్రవారం రాత్రి దాదాపు 7 గంటల సమయంలో తొలుత పట్టాలు తప్పింది. ఫలితంగా దాని పలు బోగీలు పక్కనే ఉన్న ట్రాక్‌పై పడిపోయాయి. వాటిని షాలిమార్-చెన్నై సెంట్రల్ కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టింది. దాంతో కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 15 బోగీలు బోల్తాపడ్డాయి. ఈ ప్రమాదం అక్కడితో ఆగిపోలేదు. బోల్తాపడ్డ కోరమండల్ కోచ్‌లను పక్కనున్న ట్రాక్‌పై దూసుకొచ్చిన గూడ్సు రైలు ఢీకొంది. మూడు రైళ్లు ఒకదానితో ఒకటి ఢీకొట్టుకోవడంతో ప్రమాదం తీవ్రత భారీగా పెరిగింది. ప్రమాదానికి గురైన సమయంలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్ కోల్‌కతా నుంచి చెన్నైకి వెళ్తోంది. అయితే రైల్వే అధికార ప్రతినిధి అమితాబ్ శర్మ కథనం మాత్రం మరోలా ఉండటం గమనార్హం. తొలుత కోరమండల్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిందని అమితాబ్ చెప్పారు. దాని 10-12 బోగీలు బెంగళూరు-హావ్‌డా సూపర్‌ఫాస్ట్ రైలు మార్గంలో పడ్డాయని పేర్కొన్నారు. అనంతరం ఆ సూపర్‌ఫాస్ట్ బోగీలు పక్క ట్రాక్‌పై బోల్తాపడ్డాయని వివరించారు. ప్రయాణికుల రైళ్లు అతివేగంగా ప్రయాణించడంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

## రైలు ప్రమాద కారణాలను ఇప్పటికిప్పుడు చెప్పలేం: రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

భువనేశ్వర్: ఒడిశాలోని బాలేశ్వర్ సమీపంలోని బహనాగ్ బజార్ రైల్వేస్టేషన్ వద్ద జరిగిన ఘోర రైళ్ల ప్రమాదంపై రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పందించారు. ఘటనాస్థలిని పరిశీలించిన ఆయన.. ముమ్మరంగా సహాయకచర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, ఓడీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని చెప్పారు. "క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందిస్తున్నాం. ప్రస్తుతం సహాయకచర్యలపై పూర్తిగా దృష్టి సారించాం. ఘటనాస్థలిలో సాధారణ పరిస్థితులు ఏర్పడేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రైలు ప్రమాద కారణాలను ఇప్పటికిప్పుడు చెప్పలేం. ప్రమాద ఘటనపై విచారణ చేసి మరిన్ని వివరాలు చెబుతాం. విచారణకు ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేశాం" అని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.



## రైలు ప్రమాదంలో అంతమంది ప్రాణాలు కోల్పోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నా



అమరావతి: ఒడిశా రైలు ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఒకేసారి 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడాన్ని మనసు జీర్ణించుకోలేకపోతోందన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారికి మనోస్థైర్యం ఇవ్వాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. గాయపడిన వారికి ఒడిశా ప్రభుత్వం మెరుగైన చికిత్స అందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైల్వే అధికారులతో మాట్లాడి ఏపీకి చెందిన బాధితుల వివరాలను సేకరించాలని.. వారిని సురక్షితంగా రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలను కేంద్రం అన్ని విధాల ఆదుకోవాలని అచ్చెన్నాయుడు తెలిపారు.

## వారాహి యాత్రలో బీజేపీ పాత్రేమిటో ?

అమరావతి : ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ వారాహి ప్రచార రథం రోడ్డెక్కబోతోంది. జూన్ 14వ తేదీన అన్నవరంలోని సత్యదేవుడి సన్నిధిలో పూజలు చేసి యాత్రను పవన్ మొదలుపెట్టబోతున్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని 11 నియోజకవర్గాల్లో యాత్ర రూటును ఫిక్స్ చేశారు. ప్రతి నియోజకవర్గంలో రెండురోజులు కేటాయించారు. యాత్రతో పాటు ఫీల్డ్ పర్యవేక్షణ కూడా చేయబోతున్నారు. ఒకవిధంగా వారాహి యాత్రను ఎన్నికల ప్రచారంగానే అనుకోవాలి. అంతాబాగానే ఉంది కానీ ఈ యాత్రలో మిత్రపక్షం బీజేపీ పాత్ర ఏమిటి ? అనే చర్చ మొదలైంది. బీజేపీ జనసేన మిత్రపక్షాలన్న విషయం అందరికీ తెలిసిందే. అయితే ఏరోజు మిత్రపక్షాలుగా ఉమ్మడి కార్యక్రమాలు చేసిందిలేదు. ఎంతసేపూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పవన్ బీజేపీ చీఫ్ సోమువీర్రాజు విడివిడిగా మీడియా సమావేశాలు పెడుతు సభలు నిర్వహిస్తున్నారే కానీ ఉమ్మడిగా చేసిందేమీ లేదు. పైగా ఉమ్మడి కార్యక్రమాలను చేయాలని కూడా ఎవరు అనుకోలేదు. సరే ఇదంతా చరిత్రగా ముగిసిపోయిందని అనుకుంటే మరి తొందరలో జరగబోయే వారాహి యాత్ర మాటేమిటి ? అనే చర్చ మొదలైంది. వారాహి యాత్రలో పాల్గొనేందుకు బీజేపీ నేతలను కూడా పవన్ ఆహ్వానించబోతున్నారా అనే చర్చ పెరిగిపోతోంది.

ఎందుకంటే సోమువీర్రాజుది కూడా తూర్పుగోదావరి జిల్లాలోని రాజమండ్రే. ఇపుడు ఎలాగూ మొదటివిడత పర్యటన తూర్పుగోదావరి జిల్లాలోనే మొదలవ్వబోతోంది. కాబట్టి ఇపుడైనా మిత్రధర్మాన్ని పవన్ పాటిస్తారా అనేది ఆసక్తిగా మారింది. ఒకవైపు



టీడీపీతో పొత్తుపెట్టుకునే విషయంలో పవన్ బాగా ఆసక్తిగా ఉన్నారు. ఇదే సమయంలో అవసరమైతే బీజేపీని వదిలేయటానికి కూడా పవన్ సిద్ధంగా ఉన్నారు. కలిసొస్తే మూడుపార్టీలు లేదా టీడీపీ జనసేన అన్నట్లుగా ఉంది పవన్ వైఖరి. ఈ కాంబినేషన్లన్నింటినీ దృష్టిలో పెట్టుకుంటే బీజేపీ నేతలను పవన్ తన యాత్రలో కలుపుకుని వెళతారా ? అనే సందేహాలు కూడా పెరిగిపోతున్నాయి. ఇపుడు గనుక తన యాత్రలో బీజేపీ నేతలు కలుపుకుని వెళ్ళకపోతే రాబోయే ఎన్నికల్లో కమలనాదులతో కటీఫ్ చెప్పటానికి పవన్ రెడీగా ఉన్నట్లు అర్ధమైపోతుంది. మరి చివరకు ఏమి జరుగుతుందో చూడాలి.

## రాష్ట్రానికి 8న అమిత్ షా, 10న నడ్డా రాక



అమరావతి: బీజేపీ అగ్రనేతలు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఇద్దరూ రాష్ట్ర పర్యటనకు రాబోతున్నారు.

ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ తొమ్మిదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ దేశవ్యాప్తంగా మే 30వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రుమాలు నిర్వహిస్తోంది. ఈ కార్యుక్రమాల్లో భాగంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఈ నెల 8వ తేదీన విశాఖపట్నంలో.. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పదవ తేదీన తిరుపతికి వస్తారని రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సోము వీర్రాజు తెలిపారు. విశాఖపట్నం, తిరుపతిలో రెండు చోట్ల భారీ బహిరంగ సభల నిర్వహణకు బీజేపీ రాష్ట్ర కమిటీ ఏర్పాట్లు చేస్తోంది.

## అందాల రాశీ పాన్ ఇండియాలో గేమ్ ఛేంజర్ కాబోతోందా?

దిల్లీ బ్యూటీ.. అందాల రాశీఖన్నా మూడు ముక్కలాట ఆడుతోందా? తెలుగు–తమిళం–హిందీ పరిశ్రమల్లో ఏక కాలంలో తన గ్రాఫ్ ని పెంచుకునే ఎత్తుగడలతో ముందుకు సాగుతోందా? అంటే అవుననే ఇటీవలి పరిణామాలు చెబుతున్నాయి. గడిచిన కొన్నేళ్ల పాటు టాలీవుడ్ లో వరుస చిత్రాల్లో నటించినా రాశీకి ఆశించిన బిగ్ బ్రేక్ రాలేదు. అదే క్రమంలో తెలివిగా తమిళ పరిశ్రమలో వరుస చిత్రాలకు అంగీకరిస్తోంది. అక్కడ ఆశించిన విజయాలు దక్కాయి. ఇటీవల రాజ్ అండ్ డీకే తెరకెక్కించిన ఫర్జీలో నటించిన ఈ బ్యూటీ నటిగా మరో మెట్టు పైకి ఎక్కింది. షాహిద్ – రాశీ జంట నటనకు చక్కని గుర్తింపు దక్కింది. ఫర్జీ సిరీస్ తో పాన్ ఇండియా నటిగా రాశీ ప్రజల మైండ్ లో రిజిస్టర్ అయింది. ఇకపైనా దీనిని మరో లెవల్ కి తీసుకెళ్లేందుకు రాశీ రకరకాల ఎత్తుగడలతో దూసుకెళుతోంది. తాజా సమాచారం మేరకు..మాధవన్– సిద్దార్థ్ ద్వయం నటించనున్న తదుపరి చిత్రంలో రాశి ఖన్నా నటించనుందని తెలిసింది. ఈ చిత్రంలో మరో



కథానాయికగా నయనతార పేరు వినిపిస్తోంది. మణిరత్నం సొంత బ్యానర్ లో నిర్మించే ఈ చిత్రానికి డెబ్యూ శశికాంత్ దర్శకత్వం వహించనున్నారు. ది టెస్ట్ అనే టైటిల్ ని ఫిక్స్ చేసారు. టైటిల్ కి తగ్గట్టే ఈ చిత్రాన్ని పూర్తిగా టెస్ట్ క్రికెట్ నేపథ్యంలో ఛాలెంజింగ్ పాత్రలతో రూపొందిస్తున్నారని సమాచారం. నిర్మాత శశికాంత్ దర్శకత్వం లోని ఈ స్పోర్ట్స్ డ్రామా కోసం సిద్దార్థ్ –మాధవన్ లతో నయనతార నటిస్తున్నారని రోజు ముందే వెల్లడైంది. ఈ సినిమాతో శశి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. అనూహ్యంగా రాశి ఖన్నా కూడా ఈ స్పోర్ట్స్ డ్రామా తారాగణంలో చేరనున్నట్లు మీడియాలో కథనాలొస్తున్నాయి. ఈ వార్త నిజమైతే నయనతార– రాశీ ఖన్నా కలయికలో ఇది రెండో సినిమా. గతంలో 2018లో ఇమైకా నొడిగళ్ లో మాధవన్– సిద్ధార్థతో కలిసి నయన్ నటించింది. రాశి ఖన్నాతో రెండవసారి కలిసి పని చేస్తుంది. రాశి ఖన్నా 2013లో జాన్ అబ్రహం– నర్గీస్ ఫక్రీ నటించిన మద్రాస్ కేఫ్ చిత్రంతో నటిగా వృత్తిని ప్రారంభించింది. రుద్ర – ది ఎడ్జ్ ఆఫ్ డార్క్ నెస్ తో %ఱు% స్పేస్ లో ప్రవేశించింది. ఈ సంవత్సరం ఫర్జీలో మేఘుగా వెబ్ స్పేస్ లో అలరించింది. ఇందులో షాహిద్ కపూర్ –విజయ్ సేతుపతి కూడా నటించారు. 2023లో రాశీ నటించిన రెండు సౌత్ సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

## జూ.బచ్చన్ తో ఐకాన్ స్టార్ ఆ టైప్ బిజినెస్?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఆలోచనలు ఏ ఇతర హీరోతో పోల్చినా విభిన్నంగా ఉంటాయి. అతడు తండ్రి అల్లు అరవింద్ వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని అసాధారణ ఎంటర్ ప్రెన్యూర్ క్వాలిటీస్ తో దూసుకెళుతున్నాడు. ఇటీవలే అల్లు అర్జున్ ఎగ్జిబిషన్ రంగంలో తొలి అడుగులు వేసాడు. సత్యం సింగిల్ థియేటర్ స్థానంలో ఏషియన్ సినిమాస్ తో కలిసి %ూూూ% సినిమాస్ మల్టీప్లెక్స్ ని నిర్మిస్తున్నాడు. ప్రస్తుతం అమీర్ పేట్ పరిసరాల్లో భారీ భవంతి నిర్మాణం పూర్తి చేసుకుంటోంది. అలాగే అల్లు అరవింద్– అల్లు శిరీష్ ద్వయం నిర్వహిస్తున్న ఆహా ప్రమోటర్ గా ఐకాన్ స్టార్ ఇప్పటికే ఒక బ్రాండ్ వ్యాల్యూని తేగలిగాడు. బన్ని ఇంకా ఇతర వ్యాపారాలపైనా దృష్టి సారిస్తున్నారని తెలిసింది. అతడు బాలీవుడ్ స్టార్ల తరహాలో ఆలోచిస్తున్నాడు. కింగ్ ఖాన్ షారూఖ్.. అభిషేక్ బచ్చన్ .. శిల్పాశెట్టి.. ప్రీతిజింతా లాంటి స్టార్లు స్పోర్ట్స్ రంగంలో పెట్టుబడులు పెడుతూ




క్రేజీ ఎంటర్ ప్రెన్యూర్స్ గా వెలిగిపోతున్నారు. క్రీడాకారులతో మమేకమై తమ వ్యాపారాన్ని సమృద్ధిగా అభివృద్ధి చేసుకోవడంలో సఫలమవుతున్నారు. ఇప్పుడు అదే బాటలో అల్లు అర్జున్ కూడా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చారని తెలిసింది. దగ్గుబాటి రానా ఇప్పటికే ప్రోకబడ్డీ బ్రాండ్ అంబాసిడర్ గా అభిషేక్ బచ్చన్ తో కలిసి పని చేసారు. రానా బ్రాండింగ్ బాగా పని చేసింది. అతడు ఈ వ్యాపారంలో రాణించాడు అనే కంటే కబడ్డీకి తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు తేవడంలో ఎంతో కృషి చేసాడు. ఆ తర్వాత స్పోర్ట్స్ వ్యాపారంలోకి అడుగుపెడుతున్న స్టార్ గా అల్లు అర్జున్ పేరు వినిపించనుంది. టాలీవుడ్ నుండి ఆ వ్యాపారాన్ని చేపట్టే కొత్త తరం స్టార్ హీరోలలో బన్ని పేరు మార్మోగనుంది. ఇంకా దీనిని ఐకాన్ స్టార్ అధికారికంగా ధృవీకరించకపోయినా ఫిలింసర్కిల్స్ లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆసక్తికరంగా ఇప్పటికే ఈ రంగంలో ఎంతో అనుభవం ఉన్న బాలీవుడ్ స్టార్ హీరో అభిషేక్ బచ్చన్ తో కలిసి తెలివైన పెట్టుబడులు పెట్టాలని బన్ని ఆలోచిస్తున్నాడనేది గుసగుస. ఇప్పటికే బచ్చన్ జూనియర్ కబడ్డీ ఆడే జైపూర్ పింక్ పాంథర్స్ – ఫుట్ బాల్ ఆడే చెన్నయిన్ %ఖీజ%తో సహా రెండు స్పోర్ట్స్ క్లబ్ లలో భాగస్వామి. ఇప్పుడు అల్లు అర్జున్ అతడితో కలిస్తే స్పోర్ట్స్ రంగంలో పెట్టుబడుల వెల్లువతో పాటు మరింత అదనపు హంగు యాడవుతుందని వ్యాపారవర్గాలు భావిస్తున్నాయి.




## బ్లాక్ సారీలో ఒంపుసొంపులతో దమ్కీ



మెంటల్ మదిలో చిత్రంతో హీరోయిన్ గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ నివేదా పేతురాజ్. ఈ అమ్మడు కెరీర్ ఆరంభం నుండి కూడా తన నటనతో ఆకట్టుకుంటూ ఉంది. హీరోయిన్ గానే నటించాలనే పట్టుదలకు పోకుండా వచ్చిన ప్రతి ఆఫర్ ను సద్వినియోగం చేసుకుంటూ ప్రస్తుతం టాలీవుడ్ లో యంగ్ హీరోలకు వాంటెడ్ హీరోయిన్ గా మారింది. తాజాగా విశ్వక్ సేన్ తో కలిసి దాస్ కా ధమ్కీ సినిమా తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

దమ్కీ లో అందాల విందు చేసి ఆశ్చర్యపరచిన ఈ అమ్మడు సోషల్ మీడియాలో రెగ్యులర్ గా వైరల్ అవుతూనే ఉంటుంది. తాజాగా మరోసారి ఈ అమ్మడు చీర కట్టు ఫొటోలతో అలరించింది. బ్లాక్ సారీ లో నివేదా పేతురాజ్ ను చూస్తూ ఉంటే మెంటల్ ఎక్కి పోతుంది అంటూ కొందరు కామెంట్స్ చేస్తూ ఉంటే ఇలా చీర కట్టులో దమ్కీ ఇస్తే మా పరిస్థితి ఏంటీ అంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు. మంచి ఫిజిక్ ఉండే నివేదా ఇలా చీర కట్టులో అలరిస్తే మా పరిస్థితి ఏమవ్వాలి అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సినిమాలతో పాటు సిరీస్ లు చేస్తూ ఇలా ఇన్ స్టా గ్రామ్ లో అందాల ఆరబోత చేస్తూ ఎక్కడ తగ్గని నివేదా పేతురాజ్ ముందు ముందు హాట్ అందాల ఆరబోతతో స్టార్ ఫిల్మ్ మేకర్స్ దృష్టిలో పడాలి..

తద్వారా పెద్ద హీరోల సినిమాల్లో నటించే అవకాశాలు రావాలని అభిమానులు కోరుకుంటున్నారు.

## కాంతార తరువాత ఒక్కటి క్లిక్కవ్వలే!




సౌత్ ఇండియా నుంచి ఈ మధ్యకాలంలో ఎక్కువగా పాన్ ఇండియా సినిమాలు వస్తూ ఉన్న సంగతి విదితమే. ముఖ్యంగా టాలీవుడ్ నుంచి పాన్ ఇండియా మూవీస్ ప్రహసనం కొనసాగుతుంది. అలాగే కన్నడంలో కూడా స్టార్ హీరోలు అందరూ కేజీఎఫ్ ప్రభావంతో అదే తరహా కథలతో భారీ బడ్జెట్ పాన్ ఇండియా సినిమాలు చేస్తున్నారు. అయితే పాన్ ఇండియా లెవల్ లో రిలీజ్ అయ్యి సత్తా చాటిన సినిమా చివరిగా కాంతారా మూవీ మాత్రమే కనిపిస్తుంది. ఆ తరువాత తెలుగు తమిళ్ కన్నడ భాషల నుంచి చాలా మూవీస్ పాన్ ఇండియా లెవల్ లో వచ్చిన సినిమాలు ఏవీ కూడా నార్త్ బెల్ట్ ఆడియన్స్ కి రీచ్ కాలేదు. తాజాగా తెలుగు నేచురల్ స్టార్ నాని దసరా మూవీ కూడా ఆశించిన స్థాయిలో హిందీలో హిట్ కాలేదు. అలాగే సమంత యశోద మూవీ కూడా హిందీలో పెద్దగా క్లిక్ అవ్వలేదు. కన్నడ నుంచి వేద క్రాంతి ధృవ్ సర్జా హీరోగా వచ్చిన సినిమాలు డిజాస్టర్ అయ్యాయి. అయితే పాన్ ఇండియా చిత్రాల హవా మాత్రం సౌత్ నుంచి ఇప్పట్లో తగ్గేలా కనిపించడం లేదు. ప్రతి నెలలో ఒకటి రెండు చిత్రాలు దేశ వ్యాప్తంగా ఏకంగా ఐదు భాషలలో రిలీజ్ అవ్వడానికి సిద్ధంగా ఉన్నాయి. నెక్స్ట్ ఈ జాబితాలో చూసుకుంటే ముందుగా సమంత శాకుంతలం సినిమా కనిపిస్తుంది. మైథలాజికల్ కథాంశంతో తెరకెక్కిన ఈ మూవీపై భారీ అంచనాలు అయితే ఉన్నాయి. మరి ఏ స్థాయిలో హిందీ ఆడియన్స్ కి రీచ్ అవుతుంది అనేది చూడాలి. అలాగే మణిరత్నం పొన్నియన్ సెల్వన్ 2 మూవీ హిందీలో ఏప్రిల్ 28న రిలీజ్ కాబోతుంది. మొదటి సినిమాకి హిందీలో ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. మరి పార్ట్ 2కి కూడా పెద్దగా బజ్ అయితే లేదు. దీని తర్వాత అఖిల్ సురేందర్ రెడ్డి కాంబినేషన్ లో వస్తున్న ఏజెంట్ సినిమా కూడా ఏప్రిల్ 28న పాన్ ఇండియా రేంజ్ లో రిలీజ్ అవుతుంది. ఈ మూవీపై ఇప్పటి వరకు తెలుగులోనే ఆశించిన స్థాయిలో హైప్ లేదు. మరి హిందీ ఆడియన్స్ కి ఎంత వరకు రీచ్ అవుతుందో చెప్పలేని పరిస్థితి.

దీని తర్వాత ప్రశాంత్ వర్మ తేజ సజ్జా హనుమాన్ మూవీ వచ్చే నెలలో రిలీజ్ అవుతుంది. దీనిపై కొంత హైప్ క్రియేట్ అయ్యే ఛాన్స్ లు కనిపిస్తున్నాయి. సూపర్ హీరో కాన్సెప్ట్ కావడంతో పాటు అందరికి భాగా కనెక్ట్ అయ్యే హనుమాన్ ఇందులో హీరో కావడమే కారణం అని చెప్పాలి. మరి వీటిలో హిందీలో ఏ మూవీ సక్సెస్ అవుతుంది అనేది చూడాలి.

## ఇల్లి బేబీ బెల్లి డ్యాన్స్.. వర్క్ అవుట్ అయినట్టేనా..!

గోవా బ్యూటీ ఇలియానా ఇంకా సినిమాల మీద ఆశ తీరలేదు అనుకుంటా.. ఒకప్పుడు ఆడియన్స్ ని ఉర్రూతలూగించిన అమ్మడు ఆ తర్వాత ట్రాక్ తప్పేసింది. ముఖ్యంగా సౌత్ లో స్టార్ గా ఉన్నప్పుడు ఇక్కడ కాదని బాలీవుడ్ కి చెక్కేసే సరికి మన మేకర్స్ హర్ట్ అయ్యారు ఆ తర్వాత అమ్మడు మళ్లీ తిరిగి సౌత్ సినిమాలు చేస్తానని చెప్పినా ఎవరు పెద్దగా ఛాన్స్ ఇవ్వలేదు. ఇక మధ్యలో రష్యన్ ఫోటో గ్రాఫర్ తో డేటింగ్ చేసి సినిమాలకు దూరమైన అమ్మడు తనని కూడా వదిలిపెట్టి ప్రస్తుతం సోలోగా ఉంటుంది. ఇక సరైన ఛాన్స్ కోసం ఎదురుచూస్తున్న అమ్మడికి రెండు మూడేళ్లకు ఒక అవకాశం వస్తుంది. బాలీవుడ్ లో అమ్మడు అన్ ఫెయిర్ అండ్ లవ్లీ



సినిమాలో నటిస్తుంది. అదే కాకుండా లేటెస్ట్ గా బాద్షా న్యూ మ్యూజిక్ వీడియోలో నటించింది ఇలియానా. బాలీవుడ్ ఫేమస్ ర్యాపర్ అయిన బాద్షా సబ్ గజబ్ అనే వీడియో సాంగ్ చేశాడు. ఆ సాంగ్ లో ఇలియానా కనిపించింది. ఇల్లి బేబీ మరోసారి బెల్లీ డ్యాన్స్ తో మెప్పించింది. కొన్నాళ్లుగా తన టాలెంట్ చూపించే అవకాశం కోసం ఎదురుచూస్తున్న అమ్మడికి ఇదొక లక్కీ ఆఫర్ అని చెప్పొచ్చు. ఈమధ్యనే బాద్షా సాంగ్ టీజర్ తో ఇంప్రెస్ చేయగా నేడు రిలీజైన సాంగ్ తో సర్ ప్రైజ్ చేసింది అమ్మడు. పోకిరి టైం లోనే ప్రేక్షకులను నిద్రపట్టకుండా చేసిన ఇలియానా తెలుగులో తనకంటూ మంచి ఫాలోయింగ్ ఉన్నా కూడా చాలా గ్యాప్ రావడంతో ఛాన్స్ లు రాకుండా అయిపోయింది. రీ ఎంట్రీకి రెడీ అంటున్నా ఆమెతో సినిమా చేసే ఆసక్తి ఎవరు చూపించట్లేదు. అందుకే వచ్చిన అర కొర అవకాశాలతోనే కెరీర్ లాగిస్తుంది ఇలియానా. సబ్ గజబ్ మ్యూజిక్ వీడియోతో మరోసారి తన హాట్ నెస్ ఏంటో చూపించేసింది ఇలియానా. మరి ఇది చూశాకైనా అమ్మడికి మరిన్ని ఛాన్స్ లు వస్తాయేమో చూడాలి.

## హిందీలో రిప్లై ఇచ్చిన సమంత ఫ్యాన్స్ ఫిదా

సౌత్ ఇండియా స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం శాకుంతలం సినిమా ప్రమోషన్ లో బిజీగా ఉంది. పాన్ ఇండియా లెవల్ లో ఈ మూవీ రిలీజ్ కాబోతుంది. ఈ నేపథ్యంలో శాకుంతలం సినిమాని నార్త్ ఇండియా మార్కెట్ లోకి తీసుకెళ్ళే బాధ్యత ఆమె తీసుకుంది. ఇదిలా ఉంటే ఓ వైపు సోషల్ మీడియాలో మరో వైపు పలు మీడియా చానల్స్ లో ఇంటర్వ్యూలు ఇస్తూ శాకుంతలం సినిమాని సామ్ గట్టిగా ప్రమోట్ చేస్తుంది. తాజాగా సమంత శాకుంతలం మూవీని సపోర్ట్ చేయాలంటూ ఇన్స్టాగ్రామ్ లో హిందీలో రాసి పోస్టు పెట్టింది. ఇక ఈ పోస్ట్ కి సమంత ఫ్యాన్స్ సోషల్ మీడియాలో రియాక్ట్ అయ్యారు. చాలా క్లీన్ అండ్ నీట్ గా మాట్లారారు అని కామెంట్



చేశారు. దీనిపై సమంతా రెప్లై ఇచ్చింది. అవును నేనే చేశాను అంటూ కామెంట్ చేసింది. దీనిపై మరో యూజర్ కూడా మీరు చాలా అద్భుతంగా హిందీ మాట్లాడుతున్నారు అంటూ రాసాడు. ఇప్పుడు ఈ పోస్టులు వైరల్ అయ్యాయి. మొత్తానికి సమంత అభిమానులతో ఇంటరాక్ట్ అయ్యే విధానం కూడా చాలా అద్భుతంగా ఉందనే మాట సోషల్ మీడియాలో వినిపిస్తుంది. ఇదిలా ఉంటే శాకుంతలం సినిమా మీద సమంత చాలా హోప్స్ పెట్టుకుంది. అందుకే ముంబైలోనే ఈ సినిమా ప్రమోషన్స్ అంతా చేస్తుంది. అక్కడ కాలేజీలకి వెళ్తూ సందడి చేస్తుంది. ప్రేక్షకులకి తనని తాను గ్రాండ్ గా పరిచయం చేసుకునే పనిలో ఉంది. శరీరం సహకరించాకపోయిన కూడా సినిమా సక్సెస్ కోసం తనవంతుగా ప్రయత్నం చేస్తూనే ఉంది. ఇక సామ్ డెడికేషన్ చూసి అందరూ ఫిదా అయిపోతున్నారు. మూవీ కోసం ఎంత కమిట్మెంట్ తో ఆమె వర్క్ చేస్తుందో కదా అని నెటిజన్లు కామెంట్స్ చేస్తూ ఉండటం విశేషం. సమంతని చూసి చాలా మంది హీరోయిన్స్ నేర్చుకోవాలని నెటిజన్లు కామెంట్స్ చేస్తూ ఉన్నారు. మరి శాకుంతలం సినిమా సామ్ కష్టానికి ఏ మేరకు ఫలితాన్ని ఇస్తుంది అనేది చూడాలి.



# 'కవచ్' ఉంటే భారీ నష్టం తప్పేదేమో..!



# ఒడిశా ఘోర రైలు ప్రమాదం.. అంతా 20 నిమిషాల్లోనే..!

## రైలు ప్రమాదం.. సాంకేతిక లోపమా..?మానవ తప్పిదమా?

ఒడిశాలోని బాలేశ్వర్ జిల్లాలో మూడు రైళ్లు ఒకదానితో ఒకటి ఢీకొన్న ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. దశాబ్ద కాలంలోనే అత్యంత భారీ ప్రాణ నష్టాన్ని మిగిల్చిన ఈ దుర్ఘటనలో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాంకేతికపరమైన సమస్యనా? లేదా నిర్వహణ లోపం వల్ల ఈ ప్రమాదం జరిగిందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రెండు ప్రయాణికుల రైళ్ల, ఒక గూడ్స్ రైలు వెనువెంటనే ఢీకొనడంతో ప్రమాద తీవ్రత భారీగా ఉంది. అయితే, ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై భిన్నమైన కథనాలు వెలువడుతున్నాయి. తొలుత బెంగళూరు–హావ్‌డా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పి పక్క ట్రాక్‌పై పడగా.. దానిని షాలిమార్–చెన్నై సెంట్రల్ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టిందని స్థానిక అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత కోరమాండల్ కోచ్‌లను పక్కనున్న ట్రాక్‌పై దూసుకొచ్చిన గూడ్సు రైలు ఢీకొన్నట్లు పేర్కొన్నారు. అయితే, రైల్వే అధికార ప్రతినిధి అమితాబ్ శర్మ కథనం మాత్రం మరోలా ఉండటం గమనార్హం. తొలుత కోరమాండల్ ఎక్స్‌ప్రెస్.. నిలిపి ఉంచిన గూడ్స్ రైలును ఢీకొట్టి పట్టాలు తప్పిందని, వాటి బోగీలను బెంగళూరు–హావ్‌డా సూపర్‌ఫాస్ట్ రైలు ఢీకొన్నట్లు ఆయన చెప్పారు. దీంతో ప్రమాదంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రైల్వే అధికారి చెప్పిందే నిజమైతే.. గూడ్స్ రైలు ఉన్న ట్రాక్‌పైకి కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌ను ఎలా అనుమతించారనే ప్రశ్న తలెత్తుతోంది. సిగ్నల్ వ్యవస్థలో లోపం కారణంగా ఈ తప్పిదం జరిగి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఈ సమాచార లోపం సాంకేతిక సమస్యతో జరిగిందా? లేదా మానవ తప్పిదమా?అనేది తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంపై ప్రతిపక్ష పార్టీల నేతలు కూడా ఇదే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. "సిగ్నలింగ్ వ్యవస్థ విఫలం కావడం వల్లే ప్రమాదం జరిగిందంటే నమ్మలేకపోతున్నాం. దీని వెనుక ఇంకేమైనా కారణముందా?" అని టీఎంసీ నేత ఆరోపించారు. అత్యంత రద్దీగా ఉండే ఈ మార్గంలో 'కవచ్' వ్యవస్థను ఎందుకు ఏర్పాటు చేయలేకపోయారని పలువురు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

**కవచ్ ఉంటే.. భారీ నష్టం తప్పేదేమో..! :** రైలు ప్రమాదాలను నివారించేందుకు రైల్వే శాఖ దేశవ్యాప్తంగా 'కవచ్ (%ఖుఝుఎష్ట%)' పేరుతో యాంటీ కొలిజన్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తోంది. రెడ్ (డేంజర్) సిగ్నల్‌ను పట్టించుకోకుండా లోకో పైలట్ అలాగే రైలును తీసుకెళుతుంటే.. ఈ కవచ్ వ్యవస్థతో ఆటోమెటిగ్గా బ్రేకులు పడతాయి. పట్టాలు బాగా లేనప్పుడు, ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు, ఎదురెదురుగా రైళ్లు వస్తున్నప్పుడు గుర్తించి ఇది ఆపుతుంది. దీంతో రైళ్లు ఢీకొనే ప్రమాదాలను నిలువరించొచ్చు. అయితే ప్రస్తుతం ఈ కవచ్ వ్యవస్థ దేశంలో కొన్ని మార్గాల్లోనే అందుబాటులోకి వచ్చింది. తాజాగా ప్రమాదం జరిగిన మార్గంలో ఈ కవచ్ వ్యవస్థను ఇంకా తీసుకురాలేదని రైల్వే అధికార ప్రతినిధి అమితాబ్ శర్మ వెల్లడించారు.

బాలేశ్వర్: ఒడిశా రాష్ట్రంలోని బాలేశ్వర్ జిల్లాలో మూడు రైళ్లు ఢీ కొనడం పెను విషాదాన్ని మిగిల్చింది. ఈ దుర్ఘటనలో 278 మంది ప్రాణాలు కోల్పోయారు. వందల సంఖ్యలో ప్రయాణికులు గాయపడగా.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కేవలం నిమిషాల వ్యవధిలోనే పట్టాలపై ఈ భారీ విషాదం చోటుచేసుకుందని తెలుస్తోంది. అధికారులు, ప్రత్యక్ష సాక్షులు వెల్లడించిన వివరాల ప్రకారం.. రాత్రి ఏడు గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అంతా నిమిషాల వ్యవధిలోనే జరిగిపోయింది. శుక్రవారం సాయంత్రం 6.50 గంటల నుంచి 7.10 మధ్యలో ఈ ఘోరం జరిగింది. ఆ సమయంలో ప్రయాణికులు నిద్రలో ఉన్నట్లు తెలుస్తోంది. స్థానిక అధికారుల కథనం ప్రకారం.. బెంగళూరు నుంచి పశ్చిమ బెంగాల్‌లోని హావ్‌డాకు వెళ్తున్న బెంగళూరు–హావ్‌డా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ బాలేశ్వర్ సమీపంలోని బహానగా బజార్ వద్ద శుక్రవారం రాత్రి దాదాపు 7 గంటల సమయంలో తొలుత పట్టాలు తప్పింది. ఫలితంగా దాని పలు బోగీలు పక్కనే ఉన్న ట్రాక్‌పై పడిపోయాయి. వాటిని షాలిమార్–చెన్నై సెంట్రల్ కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టింది. దాంతో కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 15 బోగీలు బోల్తాపడ్డాయి. ఈ ప్రమాదం అక్కడితో ఆగిపోలేదు. బోల్తాపడ్డ కోరమండల్ కోచ్‌లను పక్కనున్న ట్రాక్‌పై దూసుకొచ్చిన గూడ్సు రైలు ఢీకొంది. మూడు రైళ్లు ఒకదానితో ఒకటి ఢీకొట్టుకోవడంతో ప్రమాదం తీవ్రత భారీగా పెరిగింది. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇంకా చాలా మంది పట్టాల మధ్యలో చిక్కుకొని ఉన్నారని అధికారులు తెలిపారు. వారిని వెలికితీసేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాగే ప్రమాదం సమయంలో రెండు రైళ్లు అతి వేగంతో ప్రయాణించడంతో తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

**రక్తదానం కోసం బారులు..** పట్టాలపై చోటుచేసుకున్న విషాదంతో వందల సంఖ్యలో ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఆ ప్రాంతమంతా ఆర్తనాదాలతో నిండిపోయింది.

స్థానికులు సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఈ సమయంలో రక్తదానం చేసేందుకు పలువురు ముందుకొచ్చారు. బాలాసోర్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు రక్తం ఇచ్చేందుకు ప్రజలు బారులు తీరారని తెలుస్తోంది.

## న్యూజెర్సీ తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో కేసీఆర్‌ను తూర్పారబెట్టిన రేవంత్ రెడ్డి



హైదరాబాద్/అమెరికా: న్యూజెర్సీలో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. "కేసీఆర్ దోపిడీని ఇంకా ఎంతకాలం భరిద్దాం... తెలంగాణ అభివృద్ధిలో మీరు భాగస్వాములు కావాలి" అంటూ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ విజయంతోనే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం అన్ని వర్గాలు ఎంతో శ్రమించి పోరాటాలు, త్యాగాలు చేసి రాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకున్నాయని తెలిపారు. అయితే ఒక్క కేసీఆర్ కుటుంబమే పదేళ్లుగా రాష్ట్రాన్ని పాలిస్తూ అడ్డగోలుగా అవినీతి అక్రమాలకు పాల్పడుతూ రాజకీయాలను అవినీతిమయం చేశారని మండిపడ్డారు. ఇక్కడ అమెరికాలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరగడం, అందులో తాను పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. అమెరికలో ఉన్న తెలంగాణ వాళ్ళు మన ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. తెలంగాణలో 9 ఏళ్ల పాలనలో కేసీఆర్ 5 లక్షల కోట్ల అప్పు చేశారని తెలిపారు. రూ.17 లక్షల కోట్లు బడ్జెట్ ద్వారా వచ్చిందని.. రూ.22 లక్షల కోట్లు ఖర్చు చేసినా కూడా తెలంగాణ ప్రజల సగటు జీవితంలో ఎలాంటి మార్పులు రాలేదని విమర్శించారు.

కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ కోసం పోరాటం చేశామంటూ చెప్పిన టీఆర్ఎస్‌కు ప్రజలు రెండు సార్లు అవకాశం ఇచ్చారని.. కానీ కేసీఆర్ ప్రజల ఆశలు, ఆశయాలకు అనుగుణంగా పాలన చెయ్యలేదని అన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను కూడా తెలంగాణ ప్రజలు ఆదరించాలని కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజలు ఆశలు, ఆశయాలు నెరవేరుతాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## ఒడిశా రైలు ప్రమాద మృతుల కుటుంబాలకు మంత్రి కేటీఆర్ సంతాపం

హైదరాబాద్: ఒడిశా రైలు ప్రమాద ఘటనపై తెలంగాణ ఐటీశాఖ మంత్రి కేటీఆర్ స్పందించారు. ఆ దుర్ఘటనలో 233 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన షాక్ వ్యక్తం చేశారు. రైలు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ఆయన సంతాపం తెలిపారు. ప్రమాద బాధితులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు వెల్లడించారు. రైలు ప్రమాదాన్ని నివారించే యాంటీ కొలిజన్ డివైస్‌లు ఏమైనట్లు మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు.

ప్రమాద తీవ్రత చాలా ఊహించని రీతిలో ఉందని, ఈ విషాదం జరగాల్సింది కాదు అని ఆయన తన ట్విట్టర్‌లో తెలిపారు.






రైతు దినోత్సవం, మంత్రి హరీశ్‌రావు పుట్టిన రోజు నేపథ్యంలో సిద్ధిపేట పత్తి మార్కెట్‌యార్డులో ధాన్యంతో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చిత్రాలను తీర్చిదిద్దారు.

## 20 ఏళ్ల తర్వాత ఇంత ఘోర రైలు ప్రమాదం చూడలేదు

హైదరాబాద్: 20 ఏళ్ల తర్వాత ఘోర రైలు ప్రమాదం జరిగిందని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. ఒడిశా రైలు ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. "కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఎన్నికల హామీలను అమలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎక్కడ ఏర్పడినా ఇచ్చిన హామీలను నెరవేర్చే శక్తి కాంగ్రెస్ పార్టీకి ఉంది. తెలంగాణలో కేసీఆర్ అనేక హామీలు ఇచ్చారు. కానీ నెరవేర్చలేదు. బీఆర్ఎస్ పార్టీ పెట్టి మహారాష్ట్రలో తిరుగుతూ రైతు రాజ్యం అంటున్నారు. కేసీఆర్ ఖమ్మంలో రైతులు ధర్నా చేస్తే వారికి సంకెళ్లు వేశారు. రైతులపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టించిన చరిత్ర కేసీఆర్‌కు దక్కుతుంది. తెలంగాణలో ఉన్న వారికి పరిహారం ఇవ్వకుండా పంజాబ్, బీహార్ వాళ్లకు ఇచ్చారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ మోసం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఏ నిర్ణయం తీసుకుంటే ఆ మాటకు కట్టుబడి ఉంటుంది. తెలంగాణ ఇస్తామని సోనియాగాంధీ మాట ఇచ్చి నిలబెట్టుకున్నారు. పేద ప్రజలపై మోదీకి ప్రేమ లేదు. బండారు దత్తాత్రేయ తెలంగాణ కోసం పోరాడితే.. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా జరిపిన తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు కేంద్రం ఎందుకు పిలవలేదు. బడుగు, బలహీన వర్గాలకు బీజేపీ ప్రాధాన్యత ఇవ్వడం లేదు. కేసీఆర్ బీసీ బంధు అని బీసీలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారు." అని దుయ్యబట్టారు. "వచ్చే ఎన్నికల్లో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలి. మాటలు చెప్పే మోదీ, కేసీఆర్‌ను ఓడించాలి. అనేకమంది పిల్లలు ఐఐటీ, ఐఐఎం చదవడానికి కాంగ్రెస్సే కారణం. సోనియాగాంధీ తెలంగాణ ఇవ్వకపోతే కేసీఆర్ పరిస్థితి ఏంటి...? కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఓబీసీ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేశాం. 1993లో మండల్ కమీషన్ వచ్చినా ఇప్పటికీ అమలు కావడం లేదు. కాంగ్రెస్‌లో ఎవరైనా చేరవచ్చు కానీ ఐదేళ్ల వరకు పదవులు ఇవ్వొద్దు. కాంగ్రెస్ పార్టీలో బీసీలకు ప్రాధాన్యత ఇస్తామని ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌లో చెప్పారు. ప్రియాంక గాంధీ తెలంగాణలో ప్రచారం చేస్తే ప్రభావం ఉంటుంది." అని వీహెచ్ అభిప్రాయపడ్డారు.

## రైతులకు మర్యాద తెచ్చింది కేసీఆర్ ప్రభుత్వమే : ఎమ్మెల్సీ కవిత



కామారెడ్డి : రాష్ట్రంలోని రైతులకు మర్యాద తెచ్చింది కేసీఆర్ ప్రభుత్వమేనని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా సదాశివనగర్ మండలం పద్మాజివాడలో నిర్వహించిన రైతు దినోత్సవంలో ఎమ్మెల్సీ కవిత పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ రాకముందు రైతుల ఆత్మహత్యలు ఉండేవి అని కవిత గుర్తు చేశారు. ఇప్పుడు రైతుల ఆత్మహత్యలు లేవని స్పష్టం చేశారు. నకిలీ విత్తనాలు లేవు. నకిలీ విత్తనాలు సరఫరా చేసే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తున్నామని చెప్పారు. విత్తనాలు, ఎరువుల కొరత లేనే లేదు. కరెంట్ సమస్యలు కూడా లేవని స్పష్టం చేశారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులు బాగు చేసుకున్నామని కవిత పేర్కొన్నారు. దీంతో భూగర్భ జలాలు కూడా పెరిగాయన్నారు. కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. వరిసాగులో తెలంగాణ దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందన్నారు. రైతుల కోసం సంఘాలు పెట్టిన ఘనత కేసీఆర్‌దే అని స్పష్టం చేశారు. రైతులు లాభదాయకమైన పంటలవైపు దృష్టి పెట్టాలని ఎమ్మెల్సీ సూచించారు. సరిహద్దు జవాన్.. పంట పొలంలో రైతు.. ఇద్దరి వల్లే మనం ప్రశాంతంగా జీవిస్తున్నాం అని కవిత పేర్కొన్నారు. రైతుకు మర్యాద తెచ్చిన ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం అని తెలిపారు. రైతు బంధు, రైతు బీమాతో అన్నదాతకు అండగా ఉన్నామని స్పష్టం చేశారు. వ్యవసాయం అంటే దండగ అన్న స్థితి నుంచి పండగ అనే స్థాయికి తీసుకొచ్చామని చెప్పారు. రాష్ట్రం రాక ముందు రైతు అంటే అప్పులు అడుగుతారని అనుకునేవారు.. కానీ కేసీఆర్ రైతులను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశారు అని కవిత పేర్కొన్నారు.

## తెలంగాణలో వ్యవసాయంపై రైతులకు పెరిగిన ధీమా : మంత్రి గంగుల



కరీంనగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో చేపట్టిన రైతాంగ కార్యక్రమాలతో రైతులకు వ్యవసాయంపై పూర్తి నమ్మకం పెరిగిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ జిల్లా దుర్షేడ్ గ్రామంలో శనివారం నిర్వహించిన రైతు దినోత్సవంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ రైతులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. చెరువుల్లో నీరు లేక, పంటలకు నీరందక, విద్యుత్, విత్తనాల కొరత, పంటలు పండితే కొనవారు లేక అనేక సమస్యలతో బాధపడేవారని గుర్తు చేశారు. సాగు నీటి కోసం పక్కనున్న గ్రామాల రైతులతో యుద్ధాలు జరిగేవని అన్నారు. తెలంగాణ వచ్చిన తరువాత రైతుల ముఖ చిత్రం మొత్తం మారిపోయిందని వెల్లడించారు. పంటలకు సాగునీరు, ఉచిత కరెంట్, పంట పెట్టుబడికి రైతు బంధు, రైతు బీమలాంటి ఎన్నో పథకాలతో రైతులు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. తెలంగాణలో నీటి వనరులు, విద్యుత్ ఉత్పత్తి, పంట రుణాలు నాటి సమాక్య పాలకులు ఆంధ్రకు తరలించి తెలంగాణ రైతుకు తీరని నష్టం చేశారని తెలిపారు. నేడు కాళేశ్వరం జలాలతో తెలంగాణ సస్యశ్యామలమవుతుందని వివరించారు.

## తెలంగాణ రైతులు తలెత్తుకొని బతకాలి : స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి



కామారెడ్డి : బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్ రైతు వేదిక ఆవరణలో నిర్వహించిన రైతు దినోత్సవంలో శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రసంగించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు వానాకాలంలో 70 వేల ఎకరాల్లో పంట పండితే.. ఇప్పుడు ఒక లక్ష 10 వేల ఎకరాల్లో పంటలు పండిస్తున్నారని తెలిపారు. రైతులు తల ఎత్తుకొని బతకాలి.. తల దించుకుని బతకొద్దనేది కేసీఆర్ లక్ష్యమని పేర్కొన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో నీటి, కరెంట్ కొరత లేదని స్పష్టం చేశారు. 26వ తేదీన పోడు భూములకు పట్టాలు పంపిణీ చేస్తామని తెలిపారు. బాన్సువాడ నియోజక వర్గంలో 11 వేల డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టించి ఇచ్చామన్నారు. గృహలక్ష్మి పథకాన్ని జులై నెలలో ప్రారంభిస్తామని పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు.

## వ్యవసాయం దండగ కాదు పండుగ అని నిరూపించిన సీఎం కేసీఆర్ : మంత్రి ఎర్రబెల్లి

వరంగల్ : చరిత్రలో ఎవరూ చేయని విధంగా రైతులకు అన్ని విధాలా అండగా ఉంటూ వ్యవసాయాన్ని దండుగ కాదు పండుగ అని ముఖ్యమంత్రి కేసీఆర్ నిరూపించారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం దశాబ్ది వేడుకల రెండో రోజు వరంగల్ ఉమ్మడి జిల్లాలో రైతు దినోత్సవంలో పాల్గొన్నారు. ఎనుమాముల మార్కెట్, పరకాల నియోజకవర్గం గవిచర్ల, పాలకుర్తి నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని రైతు సభల్లో మాట్లాడారు. రైతులకు ఎదురుపెట్టుబడి ఇస్తున్న ప్రభుత్వం మరెక్కడా లేదని గుర్తుచేశారు. రుణమాఫీ చేయడంతో పాటు సమృద్ధిగా నీరు, అందుబాటులో విత్తనాలు, ఎరువులు, 24 గంటల ఉచిత కరెంట్, రైతు బంధు, రైతు బీమా వంటి అనేక పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు.

రైతుల భూములకు భద్రత కల్పిస్తూ, ధరణి పోర్టల్ తీసుకొచ్చారని వెల్లడించారు. రైతు వేదికలు, రైతు కల్లాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మద్దతు ధర కల్పించి, పంటల నష్టాలకు ఎకరానికి రూ 10 వేల పరిహారం ఇస్తున్నారని పేర్కొన్నారు. రైతును రాజుగా చేయడానికి సీఎం కేసీఆర్ కష్టపడుతున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో రైతాంగం కేసీఆర్‌కు అండగా నిలవాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల భూగర్భ జలాలు పెరిగాయని వివరించారు. తెలంగాణ రాకముందు, వచ్చిన తర్వాత పరిస్థితిని రైతులు బేరీజు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసనసభ్యులు నన్నపునేని నరేందర్, ఆరూరి రమేష్, జడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి, సీపీ ఏవీ రంగనాథ్, జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com